




శుక్రవారం 12.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 147 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఆపరేషన్ నేపాల్.. సక్సెస్






- మంత్రి నారా లోకేష్ చొరవతో సురక్షితంగా బయటపడ్డ నేపాల్ లో చిక్కుకున్న తెలుగు వారు
- ఖాట్మాండూ విమానాశ్రయం నుంచి రాష్ట్రానికి బయలుదేరిన 144 మంది
- బీహార్ సరిహద్దు ద్వారా భారత్ లోకి ప్రవేశించిన 22 మంది
- సిమికోట్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా భారత సరిహద్దులోని నేపాల్ గంజ్ కు చేరుకున్న 12 మంది
- నేపాల్ లో చిక్కుకున్న ప్రతి తెలుగువారిని రక్షించేవరకు కొనసాగనున్న హెల్ప్ లైన్ సెంటర్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నేపాల్ దేశంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు విద్య,ఐటీ,ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ చూపిన ప్రత్యేక చొరవ ఫలించింది. గత రెండు రోజులుగా ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు, కేంద్ర ప్రభుత్వం, నేపాల్ రాయబార కార్యాలయం, రాష్ట్రానికి చెందిన మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఖాట్మాండూ, హేటౌడా, పోఖరా, సిమికోట్ తదితర ప్రాంతాల్లో తెలుగువారు తలదాచుకున్నారు. వీరందరినీ ప్రత్యేక విమానాలు, రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రానికి తీసుకువస్తున్నారు. మంత్రి లోకేష్ కృషి కారణంగా నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారు సురక్షితంగా బయటపడ్డారు.

**ఖాట్మాండూ విమానాశ్రయం నుంచి రాష్ట్రానికి బయలుదేరిన 144 మంది ఏపీ వాసులు:**

ఇప్పటికే ఖాట్మాండూ విమానాశ్రయం నుంచి ఏపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక విమానంలో 144 మంది బయలుదేరారు. వీరిలో 104 మంది విశాఖ విమానాశ్రయానికి చేరుకోనుండగా.. మరో 40 మంది తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. విశాఖ, తిరుపతి విమానాశ్రయాల్లో తెలుగువారికి స్వాగతం పలకాలని మంత్రి లోకేష్ కూటమి ఎమ్మెల్యేలకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా విమానాశ్రయాల నుంచి వారిని స్వస్థలాలకు చేర్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మరోవైపు నేపాల్ లోని హేటౌడా నుంచి బస్సులో బయలుదేరిన 22 మంది తెలుగువారు బీహార్ సరిహద్దు ద్వారా

మిగతా 2లో...

## హామీలన్నీ అమలు!




**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అధికారంలోకి వచ్చిన 16 మాసాల కాల వ్యవధిలోనే సూపర్ హిట్ గా కూటమి ప్రభుత్వం అమలు చేయడం జరిగిందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన "సూపర్ సిక్స్ – సూపర్ హిట్" సభ విజయవంతం అవ్వడమే కాకుండా సభా ప్రాంగణాన్ని దాటిపోయి దాదాపు 12 కి.మి. వరకు ప్రజలు బారులు తీరి నిల్చుండిపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. అత్యల్ప కావలవ్యవధిలోనే తమ కూటమి ప్రభుత్వం మోగించే విజయదుందుభిని తట్టుకోలేక ప్రధాన ప్రతిపక్ష నాయకులు అక్కస్సుతో చేసే విమర్శలలో ఏమాత్రం నిజం లేదని ఆయన తెలిపారు.

గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉన్న వయస్సును, అనుభవాన్ని గౌరవించకపోగా, వారిపై శాపనార్థాలు పెట్టే విధంగా ప్రధాన ప్రతిపక్ష నాయకులు మాట్లాడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు పర్చకపోగా, అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేయడమే కాకుండా రాష్ట్రం అప్పుల ఊబిలో దింపడం జరిగిందన్నారు.

మిగతా 2లో...

## సమృద్ధిగా.. జలం

- సమర్థ నీటి నిర్వహణతోనే నీటి భద్రత
- ఈ ఏడాది వర్షాలు తగ్గినా నీటి సమస్య రానివ్వలేదు
- 2 ఏళ్లలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తికావాలి
- ప్రాధాన్యం తో శ్రీశైలం డ్యామ్ రక్షణ పనులు
- భూగర్భ జలాల నమోదుకు 3 నెలల్లో కొత్త సెన్సార్లు
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ నీటి ఎద్దడి అనేది తలెత్తకూడదని... అన్ని కాలాల్లోనూ జల వనరులు సమృద్ధిగా లభించేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఒక ఏడాది వర్షాలు సరిగ్గా లేకపోయినా, ఎగువ రాష్ట్రాల నుంచి వరద జలాలు రాకున్నా ఎలాంటి ఇబ్బంది రాకుండా నీటి నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. గతేడాది ఇదే సమయంతో పోల్చుకుంటే ఈ ఏడాది వర్షపాతం తక్కువుగా నమోదైందని, అయినప్పటికీ ఎక్కడా నీటి సమ్యస్య ఉత్పన్నం కానివ్వలేదని సీఎం అన్నారు. ఇది కేవలం సమర్ధ నీటి నిర్వహణతోనే సాధ్యమైందని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుత జలాశయాల నిల్వలు, నీటి నిర్వహణ, ప్రాజెక్టుల పురోగతి, భూగర్భజలాలు...తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**ప్రస్తుతం 1,031 టీఎంసీల నీటి నిల్వలు :** రాష్ట్రంలో మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల్లో మొత్తం 1,313 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు వీలుండగా ఇప్పటివరకు 1,031 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని భారీ, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల్లో 79 శాతం నీరు నిల్వ ఉందని అన్నారు. సెప్టెంబర్ మొదటివారానికే ఈ స్థాయికి నిండాయని వివరించారు. ఇందులో శ్రీశైలం సహా మేజర్ ప్రాజెక్టుల్లో 89 శాతం మేర,

మిగతా 2లో...

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

- కేవలం 15 మాసాల్లో రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు ఖరారు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రధాన ప్రతి పక్షం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సరే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించి తీరుతామని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందుచున్నదన్నారు. గత ప్రభుత్వ హయాంలో తిరోగమనంలో ఉన్న పారిశ్రామిక అభివృద్ధి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నేతృత్వంలో పురోగమనంలో ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రే మన రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్నందున, ఆయన మీద ఉన్న విశ్వాసంతో ప్రభుత్వం ఏర్పడి కేవలం 15 మాసాల కాల వ్యవధిలోనే దాదాపు రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు ఖరారు అయ్యాయన్నారు. అయితే రాష్ట్రంలో జరుగుచున్న పారిశ్రామిక పురోగమనాన్ని ఓర్వలేని ప్రధాన ప్రతి పక్షం తప్పుడు కథనాలతో విషం చిమ్ముతున్నదన్నారు. ఏ పరిశ్రమకు అయినా భూమిని కేటాయించే విషయంలో ప్రభుత్వం ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఎన్నో స్థాయిల్లో వెరిఫికేషన్లు అయిన తదుపరి మాత్రమే ఆ భూమికి సేల్ అగ్రిమెంట్ చేయడం జరుగుతుందన్నారు. పెట్టుబడులు,

మిగతా 2లో...

## నీటి ప్రణాళికతో సత్ఫలితాలు

- సిఎం వాటర్ మేనేజ్మంట్ తో విధానం సత్ఫలితాలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** దార్శనికుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాటర్ సెక్యూరిటీ, మేనజ్మెంట్ ఆలోచనవిధానం మంచి సత్ఫలితాలను ఇచ్చిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టుకుని రాష్ట్రంలో కరువు లేకుండా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ముందుకు అడుగులు వేస్తున్నారన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జలవనరుల శాఖకు సంబందించిన పలు ప్రాజక్టుల ప్రగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి సమగ్రంగా

మిగతా 2లో...

## 12 జిల్లాల కలెక్టర్లు బదిలీ



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో 12 జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా ప్రభాకర్ రెడ్డి, విజయనగరం కలెక్టర్‌గా రామసుందర్ రెడ్డి, ఈస్ట్ గోదావరి కలెక్టర్‌గా కీర్తి చేకూరిని నియమించారు. గుంటూరు కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా, పల్నాడు కలెక్టర్‌గా కృతిక శుక్లా, బాపట్ల కలెక్టర్‌గా వినోద్ కుమార్‌లను నియమించారు.

ప్రకాశం కలెక్టర్‌గా రాజా బాబు, నెల్లూరు కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా, అన్నమయ్య కలెక్టర్‌గా నిషాంత్ కుమార్‌లను నియమించారు. కర్నూలు కలెక్టర్‌గా డాక్టర్ ఏ.సిరి, అనంతపురం కలెక్టర్‌గా ఓ.ఆనంద్, సత్య సాయి కలెక్టర్‌గా శ్యాంప్రసాద్‌లను ప్రభుత్వం నియమించింది.

మానవీయ కోణంలో పని చేయండి: జిల్లాల కొత్త కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకమని సీఎం వ్యాఖ్యానించారు. తన ఆలోచనలు, అంచనాలు అందుకోని బెస్ట్ పెర్ఫామెన్స్ ఇవ్వాలని సూచించారు. సీఎం అంటే కామన్ మ్యాన్ అని చెపుతున్నానని, మీరూ అదే పాటించండన్నారు. అన్నింటికీ రూల్స్ కాదని, మానవీయ కోణంలో పని చేయాలని తెలిపారు. ఫేక్ ప్రచారాలు పెనుసవాల్‌గా మారాయని, రియల్ టైంలో కలెక్టర్లు స్పందించాలని వెల్లడించారు.

ఇటీవల బదిలీ అయిన పలువురు ఐఏఎస్ అధికారులు: రాష్ట్ర పాలనా యంత్రాంగంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలే ప్రభుత్వం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గత కొద్ది రోజులుగా ఈ మార్పులపై సమీక్షలు జరిపి, పనితీరు ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం. మంచి పని చేసిన అధికారులను ప్రోత్సహించేలా ఈ బదిలీలు అమలు చేసినట్టు తెలుస్తోంది.

**కీలక నియామకాలు:**

టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ మరోసారి బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ ఆయన ఈ పదవిలో పనిచేసి అనుభవం సంపాదించారు. ఇప్పటి వరకు టీటీడీ ఈవోగా ఉన్న శ్యామలరావును జీఏడీ (పొలిటికల్) ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు.

జి. అనంతరామును గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

ఎం.టి. కృష్ణబాబు రోడ్లు, భవనాలు విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

మిగతా 2లో...

## క్వాంటమ్‌కు.. రూ.200 కోట్లు పెట్టుబడి

### భారతదేశపు మొదటి క్వాంటమ్ క్రయోజెనిక్ కంపోనెంట్స్ ఫెసిలిటీ కోసం

### 200 కోట్లు పెట్టుబడి పెట్టనున్న యాంబర్ ఎంటర్‌ప్రైజెస్




**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కీలక పెట్టుబడిని ప్రకటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో జరిగిన సమావేశంలో అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ మరియు CEO జస్‌బీర్ సింగ్ అమరావతిలో భారతదేశపు మొదటి క్వాంటమ్ క్రయోజెనిక్ కంపోనెంట్స్ సౌకర్యం ఏర్పాటుకు దశలవారీగా 200 కోట్లు పెట్టుబడి పెట్టడానికి కంపెనీ నిబద్ధత వ్యక్తం చేశారు.

అధునాతన క్రయోజెనిక్ పరిష్కారాల అభివృద్ధిని సులభతరం చేయడం ద్వారా భారతదేశపు దేశీయ క్వాంటమ్ హార్డ్‌వేర్ వ్యవస్థను బలపరచడంలో ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సూపర్ కండక్టింగ్ క్వాంటమ్ కంప్యూటర్‌లకు అవసరమైన సాంకేతికత మరియు భారత ప్రభుత్వ జాతీయ క్వాంటమ్ మిషన్‌లో కీలక ప్రాధాన్యతగా ఉంది. ఈ వ్యూహాత్మక కార్యక్రమం అమరావతిని సాంకేతిక ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మార్చాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తుంది.

ఈ సందర్భంగా జస్‌బీర్ సింగ్ మాట్లాడుతూ "ఈ ప్రాజెక్ట్ క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థను నిర్మించే భారతదేశ ప్రయాణంలో పెద్ద ముందడుగుగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఈ లక్ష్యంలో భాగస్వామ్యం అవ్వడం గర్వం మరియు మరింత ఉత్సాహాన్ని ఇస్తుంది. తరువాతి తరం సాంకేతిక పరిజ్ఞానాలలో భారతదేశ నాయకత్వానికి మా వంతు సహకారం అందించడానికి ఎదురుచూస్తున్నాం."

మిగతా 2లో...







# నేపాల్‌లో మంటలు రగిలించిన యువత ఆగ్రహం

నేపాల్ వీధులు గత రెండు రోజులుగా అగ్నికుండంలా మారిపోయాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు బలి అయినా, ప్రజల ఆగ్రహం చల్లారలేదు. ఎందుకంటే సమస్య కేవలం సోషల్‌మీడియా నిషేధం కాదు. అసలు సమస్య చాలా లోతైనదిఉపాధి కోల్పోతామనే భయం, ఆర్థిక కష్టాలు, అవినీతి పాలన, రాజకీయ అస్థిరత.

**సోషల్‌మీడియా కేవలం వినోదం కాదు** : ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్ సహా 26 సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఓలి ప్రభుత్వం ఒక్కసారిగా నిషేధించింది. ఇవి వినోదానికి మాత్రమే కాకుండా, వేలాది యువతకు ఉపాధి వనరులు. కంటెంట్ క్రియేటర్లు, గిగ్ వర్కర్లు, చిన్న వ్యాపారులుఇందరి జీవనాధారమే ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు. వాటిని మూసివేయడం అంటే ఉపాధి ద్వారాలన్నీ మూసేయడమే.

**నిరుద్యోగం-వలసలు-ఆర్థిక సంక్షోభం** : నేపాల్‌లో 2024లో యువ నిరుద్యోగం 20.82 శాతం దాటింది. ఉద్యోగ అవకాశాలు లేవు. అందుకే ప్రతి ఏడాది లక్షలాది యువత విదేశాలకు వలస వెళ్తున్నారు. 2024–25లోనే ప్రభుత్వం 8.39 లక్షల మందికి మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ ఈ వలసల మూల్యం దేశం భరించలేకపోతోంది. ఎందుకంటే జిడిపి లోటు పెరుగుతోందిఅది 33 శాతం వరకు పడిపోయిందనే అంచనా. వలసలపై ఆధారపడే దేశ ఆర్థిక వ్యవస్థ నాజూకుగా మారింది.

**పన్నుల పిడుగు - ఉపాధిపై దెబ్బ**: నేపాల్ ప్రభుత్వం విదేశీ ఈ–సర్వీస్ ప్రొవైడర్లపై భారీ పన్నులు వేసింది. అంతర్జాతీయ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఆ దేశంలో నమోదు చేసుకోవడాన్ని నిరాకరించాయి. ఫలితయివాటిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న యువత ఒక్కసారిగా నిరాశలోకి వెళ్లారు. ఇదే ఆగ్రహానికి కారణమైంది.

**రాజకీయ అస్థిరత - అవినీతి వ్యాపకం** : గత కొన్నేళ్లుగా నేపాల్‌లో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ఒక్కొక్కటి అవకాశవాద ధోరణితో పనిచేశాయి. పాలక వర్గాల్లో అవినీతి పెరిగింది. వామపక్షాలు అభివృద్ధి దిశగా వెనక్కి తగ్గాయి. ఈ కారణాల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పూర్తిగా దెబ్బతింది.

**ఆందోళనలు - దక్షిణాసియాలో** : ఈ నిరసనలను గమనిస్తే బంగ్లాదేశ్ విద్యార్థి ఉద్యమాలు, శ్రీలంకలో అరగలయ ఉద్యమం గుర్తుకు వస్తాయి. అక్కడలాగే.. నేపాల్‌లో కూడా విద్యార్థులు, నిరుద్యోగ యువత, గిగ్ వర్కర్లు అందరూ ఒకే వేదికపైకి వచ్చారు. ఇది కేవలం సోషల్‌మీడియా కోసం పోరాటం కాదుబీ ఉపాధి–భవిష్యత్తు–ఆత్మగౌరవం కోసం పోరాటం.

**నేపాల్ ప్రభుత్వానికి హెచ్చరిక** : నేపాల్ యువత వీధుల్లోకి వచ్చి రక్తం చిందిస్తే.. అది ఒక పెద్ద హెచ్చరిక. దీనిని కేవలం చట్టరక్షణ సమస్యగా కాకుండా, ఆర్థిక–సామాజిక సంకేతంగా పరిగణించాలి. ఉపాధి అవకాశాలు కల్పించడం, అవినీతి తగ్గించడం, రాజకీయ స్థిరత్వం సాధించడం తప్పనిసరి. లేకపోతే ఈ నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చి దేశ భవిష్యత్తును చీకటిలోకి నెడతాయి.

**-అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్**

# ఆపరేషన్ నేపాల్.. సక్సెస్



(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలోకి ప్రవేశించారు. అటు నేపాల్ సిమికోట్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా 12 మందిని భారత సరిహద్దులోని నేపాల్ గంజ్ కు తరలించారు. అక్కడి నుంచి వీరిని వాహనాల ద్వారా లక్నోకు తరలించారు. లక్నో నుంచి ప్రత్యేక విమానం లో వీరు రాష్ట్రానికి చేరుకోనున్నారు. నేపాల్ లో చిక్కుకున్న ప్రతి తెలుగువ్యక్తిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చే బాధ్యత తీసుకున్న మంత్రి లోకేష్ కు ఈ సందర్భంగా ఏపీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

**చివరి తెలుగు వ్యక్తిని రాష్ట్రానికి తీసుకువచ్చే వరకు కొనసాగనున్న హెల్ప్ లైన్ సెంటర్** : నేపాల్ లో చిక్కుకున్న చివరి తెలుగు వ్యక్తిని రాష్ట్రానికి సురక్షితంగా తీసుకు వచ్చేంత వరకు ఏపీ భవన్, ఆర్టీజీఎస్ కేంద్రంలో ఏర్పాటుచేసిన హెల్ప్ లైన్ సెంటర్ కొనసాగనుంది. వారిని తీసుకువచ్చే బాధ్యత కూడా కూటమి ప్రభుత్వం తీసుకోనుంది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేయడం జరిగింది.



# సమృద్ధిగా.. జలం



(మొదటి పేజీ తరువాయి)

మీడియం జలాశయాలు 57 శాతం, మైనర్ ప్రాజెక్టుల్లో 39 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. సోమశిల, కండలేరు, బ్రహ్మంసాగర్ నింపే విషయంలో సమస్యలను పరిష్కరించాలని సీఎం అన్నారు.

**38,457 చెరువులు నింపేలా చర్యలు**: రాష్ట్రంలో 38,457 చెరువులకు గాను... 32,642 చెరువులను ఇంకా పూర్తిగా నింపాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని 497 చెరువులకు గాను 51 చెరువులు పూర్తిగా నిండాయని అధికారులు తెలిపారు. అన్ని చెరువులు వీలైనంత త్వరగా నింపగలిగితే హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని 89,117 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే రూ.6,518 కోట్ల వ్యయమయ్యే ప్రాధాన్య ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీనిద్వారా 2,81,139 ఎకరాలకు కొత్తగా సాగునీరు ఇవ్వడంతో పాటు, 3,38,326 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం సాధ్యపడుతుందన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, బొడ్డేపల్లి రాజగోపాల రావు వంశంధార ప్రాజెక్ట్, సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్, తారకరామ తీర్థ సాగరం రిజర్వాయర్ ప్రాజెక్ట్, గాలేరు నగరి సుజల స్రవంతి పనుల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. గాలేరు నగరి సుజల స్రవంతి 108 కి.మీ. మేర పూర్తి చేసి కడప వరకు నీటిని తీసుకువెళ్లేలా, పనులు నిలిచిన చోట్ల మళ్లీ టెండర్లు పిలిచి యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. రూ.1,686 కోట్లతో చేపట్టిన శ్రీశైలం డ్యామ్ రక్షణ పనులు, ఎస్కేప్ చానల్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనీ సూచించారు.

**ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ. 2 వేల కోట్లు** : ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయండి. ఇందుకోసం ఈ ఏడాది వెయ్యి కోట్లు, వచ్చే ఏడాది మరో వెయ్యి కోట్లు ఇస్తాం. అటు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్... ఇటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి.. ఇలా రెండు వైపులా పంపులతో విశాఖ నగరానికి ఈ ప్రాజెక్టులు విస్తరించాలి. వంశధార, నాగావళి, చంపావతి అనుసంధానం చేస్తూ ఈ ప్రాంతంలోని అన్ని రిజర్వాయర్లు నింపడం ద్వారా ఉత్తరాంధ్రలో వాటర్ నెట్వర్క్ ఏర్పాటు చేయాలి. ఇది ఉత్తరాంధ్ర నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తుంది. ఏలేరు పూర్తిగా నింపాలి. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని తరలించడానికి ఏలేరు ఎంతో కీలకం.' అని అన్నారు.

**ముందుగా వరికపూడిసెల ఫేజ్ 1 పనులు** : హెడ్ వర్క్స్ మినహా వరికపూడిసెల ఫేజ్ 1లో మిగిలిన అన్ని పనులు పూర్తి చేసి 24,900 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిచ్చేందుకు సిద్ధం చేయాలని సీఎం అధికారులకు చెప్పారు. అలాగే ఫేజ్ 2 పనులకు సంబంధించి అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చే ఏడాది జనవరి నాటికల్లా సాధించాలని ఆదేశించారు. రెండు దశలు పూర్తి చేయడానికి రూ.1,925 కోట్లు వ్యయం కానుండగా, 84,281 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. గతేడాదికన్నా ఈ ఏడాది రాష్ట్రంలో 1.25 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయి. సెప్టెంబర్ 1వ తేదీ నాటికి సగటు భూగర్భజలాలు 8.43 మీటర్లుగా ఉన్నాయి. భూగర్భజలాలు 8 మీటర్ల కంటే దిగవకు ఉన్న 7,762 గ్రామాల్లో వాటి పెంపునకు ఫామ్ పాండ్స్, చెక్ డ్యామ్‌ల నిర్మాణం వంటి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

అలాగే భూగర్భ జలాల సమాచారం రియల్ టైమ్‌లో స్పష్టంగా తెలుసుకునేందుకు వచ్చే 3 నెలల్లో కొత్త సెన్సర్ల ఏర్పాటు పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నీటి ప్రణాళికతో సత్ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)




సమీక్షించి పలు ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. గతేడాదితో పోల్చితే రాష్ట్రంలో గ్రౌండ్ వాటర్ , మేజర్, మీడియం రిజర్వాయర్ లలో నీటినిల్వలు పెరిగాయన్నారు. గత ఏడాది వర్షపాతంతో పోల్చితే, ఈ ఏడాది 9 శాతం వర్షపాతం తక్కువగా నమోదు అయినా కూడా భూగర్భజలాలు , మేజర్, మీడియం రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉన్నాయంటే, అదంతా రాష్ట్ర ముఖ్యమంత్రి వాటర్ సెక్యూరిటీ, మేనేజ్మెంట్ వల్లే సాధ్యం అయిందన్నారు. మేజర్, మీడియం రిజర్వాయర్లలో 85.6 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని, భూగర్భ జల మట్టాలు కూడా 8.43 మీటర్లకు చేరుకున్నాయని తెలిపారు. అదే విదంగా తుంగ భద్ర డ్యామ్ 33 గేట్లు మార్చడానికి రూ.52 కోట్ల నిధులను, దవళేశ్వరం బ్యారేజ్ కు కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.138 కోట్లను ముఖ్యమంత్రి కేటాయించారని, ఆయా పనులు వచ్చే ఏడాది వర్షాకాలం ప్రారంభంలోపు పూర్తి చేయాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రూ.209 కోట్లతో శ్రీశైలం ప్రాజెక్టులో గ్రౌటింగ్, స్పిల్వే పనులు, అప్రాన్ వంటి పెండింగ్ పనులు చేయాలని సూచించారన్నారు. రాయలసీమ లో కీలకమైన గోరకల్లు రిజర్వాయర్ ప్రమాదభరితం గా ఉంటే గత ఐదేళ్లలో ఒక్క రూపాయు కూడా కేటాయుంచలేదని, వచ్చే సీజన్ నాటికి గోరకల్లు రిజర్వాయర్ కి మరమ్మతులు పూర్తి చేసేలా రూ.56 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో చేయలేని పనిని ఒక్క ఏడాదిలోనే హంద్రీ నీవా పనులు పూర్తిచేసి కుప్పంకు నీరందించామన్నారు. హంద్రీ నీవా ద్వారా 497 చెరువులకు నీరు అందించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. 2026 జూన్ కి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. రాష్ట్రంలో ఉన్న దాదాపు 38,457 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల మరమ్మత్తు పనులను చేపట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు వంశధార, తోటపల్లి, వంశధార – నాగావళి లింక్ , జంఝావతి, హిరమండలం లిఫ్ట్ , నాగావళి– చంపావతి, మహేంద్ర తనయ, తారకరామ వంటి కీలకమైన 9 ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని వరికిపూడి శిల ప్రాజెక్ట్ కు ఉన్న అడ్డంకులను అధిగమించేలా అనుమతులు తీసుకోవాలని సూచించారన్నారు. రాష్ట్రం లో 1008 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజక్టులు ఉంటే, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వాటిలో దాదాపు 613 లిఫ్ట్ లు పని చేయడంలేదని, వీటి మరమ్మత్తుకు దాదాపు రూ.725 కోట్లు అవసరమని అంచనా వేయడం జరిగిందని, టెండర్ల ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి వాటి మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు.

రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు వేంకటేశ్వర రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# హామీలన్నీ అమలు!

(మొదటి పేజీ తరువాయి)



అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దడంలోనే నాలుగైదు మాసాలు గడిచిపోయాయని, మిగిలిన ఏడాది కాలంలోనే తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నింటినీ విజయవంతంగా అమలు చేయడం జరిగిందన్నారు.

తమ ప్రభుత్వం ఏ ఒక్క పింఛన్ ను తొలగించలేదని, గతంలో ఉన్న పింఛన్లనే కొనసాగించిందన్నారు. పింఛన్ల రూపేణా గత ప్రభుత్వం మాసానికి రూ.1400 కోట్లు వెచ్చిస్తే తమ ప్రభుత్వం రూ.2,746 కోట్లను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పింఛన్లు పొందుతూ భర్తను కోల్పోయిన వితంతువులకు వితంతు పింఛన్లు తమ ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతు భరోసా పథకం క్రింద ప్రతి రైతుకు రూ.13 వేలు ఇస్తామన్న గత ప్రభుత్వం కేవలం రూ.7 వేలు మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. అయితే తమ ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం క్రింద ఏడాదికి మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని చెప్పి తొలి విడత సొమ్మును దాదాపు 47 లక్షల మంది రైతుల ఖాతాలకు జమచేయడం జరిగిందన్నారు. ఈ రూ.20 వేలులో రూ.14 వేలు రాష్ట్ర వాటాగా ఇస్తుందని, మిగిలిన రూ.6 వేలను కేంద్ర వాటాగా అందజేయడం జరుగుతుందని స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. అమ్మఒడి పథకం క్రింద గత ప్రభుత్వం కుటుంబంలో ఒక్క విద్యార్థికి మాత్రమే ఆర్థిక సహాయాన్ని అందజేస్తే తమ ప్రభుత్వం తల్లికి వందనం పథకం క్రింద కుటుంబంలోని విద్యార్థులు అందరికీ ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరుగుచున్నదన్నారు. ఈ పథకం క్రింద తమ ప్రభుత్వం దాదాపు 67 లక్షల మంది విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. హామీ ఇచ్చిన విధంగా దీపం–2 పథకం క్రింద దాదాపు కోటి మందికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుచున్నదన్నారు. స్త్రీ శక్తి పథకం క్రింద దాదాపు 2.6 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈ పథకం క్రింద ప్రతి రోజూ దాదాపు 25 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేయడం జరుగుచున్నదన్నారు. ఇందుకై దాదాపు రూ.2 వేల కోట్లను ప్రభుత్వం భరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికే దాదాపు ఆరేడు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కలిగే పరిస్థితులను కల్పించడం జరిగిందన్నారు. మెగా డిఎస్సీ ద్వారా 16,672 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి ఇప్పటికే దాదాపు 5.50 కోట్లు మంది కి ఆకలి తీర్చడం జరిగిందన్నారు. 2022 లో 17 వైద్య కళాశాలల నిర్మాణాలను రూ.8,480 కోట్లతో ప్రారంభించామని చెప్పుకున్న గత ప్రభుత్వం కేవలం 7 వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబందించి మాత్రమే కాంట్రాక్టను కుదుర్చుకోవడం జరిగిందన్నారు. రెండు సంవత్సరాల కాలవ్యవదిలో కేవలం రూ.1282 కోట్లను మాత్రమే ఖర్చు చేయడం జరిగిందని, అందులో కూడా రూ.689 కోట్లను బకాయిలు పెట్టడం జరిగిందన్నారు. ఈ సొమ్మును కూడా నాబార్డు నుండి అప్పుగా పొంది ప్రభుత్వం పై వడ్డీబారాన్ని మోపడం జరిగిందన్నారు. అయితే తమ ప్రభుత్వం 1990 నాటి ఆర్థిక సరళీ కరణ విధానాన్ని అనుసరిస్తూ ప్రభుత్వంపై, ప్రజలపై, విద్యార్థులపై ఎటు వంటి వడ్డీ బారం లేకుండా పిపిపి విధానంలో ఈ వైద్య కళాశాలల నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం క్రింద కేవలం 4.50 కోట్లకు మాత్రమే ఆరోగ్య సేవలు అందజేస్తే తమ ప్రభుత్వం ఎన్.టి.ఆర్.వైద్య సేవ పథకం క్రింద దాదాపు 5.10 కోట్లుకు పైబడి ఉచితంగా వైద్య సేవలను అందజేయడం జరుగుచున్నదన్నారు. అదే విధంగా వేట నిషేదిత సమయంలో మత్స్యకారులకు గత ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.20 వేలు ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం నాయీ బ్రహ్మణులకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తే తమ ప్రభుత్వం రూ.25 వేలుతో పాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందజేయడం జరుగుచున్నదన్నారు. నేతన్న నేస్తం క్రింద చేనేత కార్మికులకు గత ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.24 వేలు ఇవ్వడమే కాకుండా చేతి మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ లకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందజేయడం జరుగుచున్నదన్నారు. గౌడ కులస్తులకు బార్స్, వైన్ షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని మంత్రి తెలిపారు.

# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధలను నెరవేర్చిన తదుపరే సేల్ డీడ్ చేయడం జరుగుతుందన్నారు. అయితే ఈ ప్రక్రియపై ప్రధాన ప్రతిపక్షానికి ఎటు వంటి అవగాహన లేకుండా ఇపో్క, హెచ్.ఎఫ్.సి.ఎల్., ఎలీప్, వారాహి ఆక్వా ఫార్మ్ మరియు జై కుమార్ సంస్థలకు అడ్డగోలుగా భూములు ఇవ్వడం జరిగిందనే తప్పుడు కథనంతో విషం జిమ్మడం జరిగిందన్నారు. ఇపో్క, హెచ్.ఎఫ్.సి.ఎల్., ఎలీప్ సంస్థలకు గతంలోని ఒప్పందాల మేరకే భూములను కేటాయించడం జరిగిందని, వారాహి ఆక్వా ఫార్మ్ మరియు జై కుమార్ సంస్థలు వారి సొంత స్థలాల్లో ప్రైవేట్ పార్కుల అభివృద్ధికి అనుమతించడం జరిగిందన్నారు. ఈ భూములతో ఏపిఐఐసి కి ఏమాత్రం సంబందం లేదన్నారు. ప్రధాన ప్రతి పక్షం అనేది నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తూ రాష్ట్రాభివృద్ధికి సహకరించాలే కానీ, ఇటు వంటి తప్పుడు కథనాలతో రాష్ట్ర పురోభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రధాన ప్రతి పక్షం తమ ప్రవర్తనను మార్చుకోకుండా ఇదే పందాలో ప్రవర్తిస్తే వచ్చే ఎన్నికల్లో మరింత ఘోర పరాభవానికి గురి కాక తప్పదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# 12 జిల్లాల కలెక్టర్లు బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

ముఖేశ్‌కుమార్ మీనాను రెవెన్యూ (ఎక్సైజ్) ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమిస్తూ, అదనంగా గనుల విభాగం బాధ్యతలు అప్పగించారు.

**ఇతర బదిలీలు:**

కాంతిలాల్ దండే – పర్యావరణ, అటవీ విభాగం కార్యదర్శి
సౌరభ్ గౌర్ – ఆరోగ్యశాఖ కార్యదర్శి (అదనంగా పౌరసరఫరాలశాఖ కార్యదర్శి బాధ్యతలు)
ప్రవీణ్‌కుమార్ – ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్
సీహెచ్. శ్రీధర్ – మైనార్టీల సంక్షేమ కార్యదర్శి
ఎంవీ. శేషగిరిబాబు – కార్మికశాఖ కార్యదర్శి
ఎం. హరి జవహర్‌లాల్ – దేవాదాయశాఖ కార్యదర్శి

# క్వాంటమ్‌కు.. రూ.200 కోట్లు పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

అంబర్ ఎంటర్‌ప్రైజెస్ పెట్టుబడిని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఈ మైలురాయి భవిష్యత్ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్య గమ్యస్థానంగా మారడాన్ని మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. IBM మరియు TCS క్వాంటమ్ కంప్యూటర్‌లతో కలిసి జాతీయ క్వాంటమ్ మిషన్ యొక్క బలమైన మద్దతుతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ కార్యక్రమం క్వాంటమ్ కంప్యూటింగ్ మరియు అధునాతన ఎలక్ట్రానిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో పరిశోధన, ఆవిష్కరణలు మరియు కీలక భాగాల తయారీకి దృఢమైన పునాది వేస్తుందన్నారు.

జాతీయ క్వాంటమ్ మిషన్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ జె.బి.వి. రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొని క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానాలకు బలమైన దేశీయ సరఫరా గొలుసు నిర్మాణంలో ఈ ముఖ్యమైన అడుగుకు మద్దతు ప్రకటించారు.

ఈ ప్రకటనతో యాంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఆంధ్రప్రదేశ్ క్వాంటమ్ వ్యాలీ లక్ష్యాలకు మద్దతు ఇస్తున్న ప్రముఖ భాగస్వాముల జాబితాలో చేరింది. ప్రపంచ వేదికపై క్వాంటమ్ రంగంలో భారతదేశ ప్రాధాన్యతను పెంచడం మరియు క్వాంటమ్ సాంకేతిక విప్లవంలో రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలిపింది.

# స్మార్ట్‌గా.. రేషన్



**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా 29,796 రేషన్ షాపుల ద్వారా తెల్లరేషన్ కార్డులదారులకు పారదర్శకంగా బియ్యం, తదితర సరుకుల పంపిణీ చేయడం జరుగుతుందని వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కానూరులోని సివిల్ సప్లైస్ భవన్ లో గురువారం పాత్రికేయుల సమావేశంలో వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నూతన సాంకేతికతతో క్యూర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులను కొన్ని చోట్ల 85 శాతం, మరికొన్ని చోట్ల 95 శాతం షెడ్యూల్ లో పేర్కొన్న ఆయా జిల్లాల్లో రేషన్ షాపులు వద్ద, గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించడం జరిగిందన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వృద్దులకు ఇళ్లకు వెళ్లి ఇస్తున్నామన్నారు. నాలుగు దశల్లో 1 కోటీ 45 లక్షల స్మార్డ్ కార్డుల పంపిణీ ఆయా రేషన్ కార్డుల దుకాణాల వద్ద, గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ చేస్తున్నామన్నారు. రెండు విడతలుగా ప్రజలకు ఈకెవైసీ ఆధారంగా ఈ కార్డులు అందిస్తున్నామన్నారు. దేశంలోనే 96.5 శాతం ఈకైవైసి చేసిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. ఈనెల 15 నుంచి అన్ని జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ జరుగుతుందన్నారు.

స్మార్ట్ కార్డుల్లో కొన్ని చోట్ల తప్పులు ఉన్నట్లు మా దృష్టికి వచ్చాయని, అయితే ఈకెవైసీ, ఆధార్ ఆధారంగా మేము కార్డులను ముద్రించామని, పేర్ల మార్పు, చిరునామాల మార్పులు చేసుకోకపోవడం వల్లే ఈ తప్పులు జరిగినట్లు సమాచారం ఉందన్నారు. పోర్టబులిటీ ఉన్నందున సరుకులు ఏ రేషన్ షాపు నుంచైనా తీసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇప్పుడు కార్డులు ప్రజలకు అందిస్తున్నారన్నారు. రేషన్ కార్డులో మార్పులు చేయాల్సి వస్తే.. సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందన్నారు. అక్టోబర్ 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. వచ్చే వారం నుంచి మన మిత్ర యాప్ లో కూడా కార్డులో మార్పులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రేషన్ షాపులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనుకుంటే ఆయా షాపు వద్ద ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ ను మీ ఫోన్ లో స్కాన్ చేసి, అక్కడ మీకు కలిగిన ఇబ్బందిని తెలియచేయవచ్చన్నారు. నవంబర్ 1 వ తేదీ నుంచి నామినల్ ఫీజు రూ. 35 చెల్లిస్తే కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పోస్టల్ శాఖ ద్వారా రిజిస్టర్ పోస్టులోఇంటికి పంపిస్తున్నామన్నారు. అక్టోబర్ 31 వరకు మాత్రం ఉచితంగా నిర్ధేశించిన ప్రాంతాల్లో ఈ స్మార్ట్ కార్డులు అందిస్తామన్నారు. మూడు నెలలు వరుసగా రేషన్ తీసుకోకుంటే రేషన్ కార్డు రద్దు అవుతుందని కాని ఆ తర్వాత సచివాలయాలకు వెళ్లి సరైన సమాచారం ఇస్తే... మళ్లీ రేషన్ కార్డు యాక్టివేట్ అవుతుందన్నారు. 890 కార్డులు రద్దుకు సంబంధించి మాకు దరఖాస్తులు వచ్చాయని, స్థానిక తహశీల్దారు దీనిపై పరిశీలన చేసిన తర్వాత అర్హత ఉంటే మళ్లీ కార్డులు పునరుద్ధరిస్తామన్నారు. రాష్ట్రంలో 4.42 కోట్ల మందికి ప్రతి నెలా రేషన్ ను సరఫరా చేస్తున్నామన్నారు. ఉచిత గ్యాస్ మూడో విడతలో ఉన్నామన్నారు. 97.59 లక్షల మందికి తొలి విడతలో దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. రైస్ కార్డు ఉన్న అందరినీ అనుసంధానం చేసి.. దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ అందించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో 5 కేజీల సిలిండర్ నుంచి 14.5 కేజీల సిలిండర్లను అందిస్తున్నామన్నారు. మొదటి, రెండో విడతకు మనకు కొత్తగా రెండు లక్షల గ్యాస్ కనెక్షన్ లు పెరిగాయన్నారు. స్మార్ట్ కార్డులో ఉన్న క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే వారి వివరాలు వస్తాయన్నారు.

# మహిళలకు మెరుగైన వైద్యం




మంగళగిరి,(జర్నలిస్ట్ ఫైల్): మహిళల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ తో సహా దేశ వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 15 రోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు జరగబోతున్నాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు "స్వస్త్ నారీ–స్వషక్త్ పరివార్ అభియాన్ "నినాదంతో తో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు, ప్రాథమిక, పట్టణ, సామాజిక, ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల్లో ఈ వైద్య శిబిరాలు జరుగనున్నాయి. ఈ వైద్య శిబిరాల ద్వారా స్పెషలిస్టు వైద్యులు మహిళలకు చికిత్స అందించనున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ శిబిరాలను ప్రారంభించనున్నారు. ఇదే సమయానికి ఇతర రాష్ట్రాల్లో వైద్య శిబిరాలు ప్రారంభమవుతాయి. విశాఖలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. రాష్ట్రంలోని 10,032 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు, 1,144 పీహెచ్సీలు, 560 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 175 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ వైద్య శిబిరాలు నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**స్పెషలిస్టు వైద్యుల ద్వారా పరీక్షల నిర్వహణ :** ఈ వైద్య శిబిరాల్లో గైనిక్, చిన్నపిల్లల వైద్యులు, కంటి, ఈఎన్టీ, డెంటల్, సైకియాట్రీ, డెర్మటాలజీ వైద్యులు సేవలందిస్తారు. ఈ శిబిరాల్లో ప్రత్యేకంగా హెల్త్ కియోస్క్ లను ఏర్పాటు చేస్తారు. మహిళలకు హిమోగ్లోబిన్, బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ స్క్రీనింగ్, గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తారు. చిన్నారులకు టీకాలు వేస్తారు. రక్తదాన శిబిరాలు కూడా నిర్వహిస్తారు. పౌష్టికాహార ప్రాధాన్యం గురించి కూడా మహిళలకు వివరిస్తారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనిమీయా స్క్రీనింగ్ చేసి, కార్డుల్ని జారీ చేస్తారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డులు, 70 ఏళ్లు దాటిన వారికి వయోవందన కార్డుల జారీకి అవసరమైన రిజిస్ట్రేషన్లు ఈ వైద్య శిబిరాల్లో జరుగుతాయి.

**ఏర్పాట్లపై కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్ :** మంగళగిరి ఎపిఐఐసి టవర్స్ లోని తన కార్యాలయం నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు వైద్య శిబిరాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. శిబిరాల ప్రారంభ కార్యక్రమంలో లోక్ సభ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఆహ్వానాలు పంపాలని, శిబిరాల ద్వారా చికిత్స పొందిన వారి వివరాలను ఆన్ లైన్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టంచేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు, అసోసియేషన్ల వారిని కూడా వైద్య శిబిరాల నిర్వహణలో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు.

# నేపాల్‌లో అనిశ్చితి..



**నేపాల్:** కల్లోల నేపాల్ రాజకీయాల్లో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు కోసం 'జెన్–జెడ్' ఉద్యమకారులు ప్రయత్నిస్తున్నప్పటికీ చర్చలు కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో పార్లమెంటును రద్దు చేసి ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలని, రాజ్యాంగాన్ని సవరించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.

**రాజకీయాలు చేయొద్దు..!**

ప్రస్తుత రాజకీయ సంక్షోభానికి పరిష్కారం కనుగొనేందుకు నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సింగ్డెల్‌తో జెన్–జెడ్ ప్రతినిధులు ఆర్మీ హెడ్‌క్వార్టర్‌లో చర్చలు జరుపుతున్నారు. ఇదే సమయంలో మరికొందరు జెన్–జెడ్ గ్రూపు ప్రతినిధులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

సొంత ప్రయోజనాల కోసం తమను ఉపయోగించుకోవద్దని పాత రాజకీయ పార్టీలను ఈ సందర్భంగా జెన్–జెడ్ ఉద్యమకారులు హెచ్చరించారు. ఇది పూర్తిగా పౌర ఉద్యమమని, తమతో రాజకీయాలు చేయడానికి ప్రయత్నించొద్దని స్పష్టం చేశారు. జాతీయ సమగ్రత, సార్వభౌమత్వాన్ని రక్షించడం తమ ముందున్న అతిపెద్ద సవాల్ అని.. సంక్షోభ సమయంలో నేపాల్ పౌరులంతా ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**సారథిపై మంతనాలు..**

నేపాల్ తాత్కాలిక సారథిని ఎంపిక చేసుకోవడంలో జెన్–జెడ్ ఉద్యమకారులు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నట్లు తెలుస్తోంది. మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి, విద్యుత్ బోర్డు మాజీ ఎండీ కుల్మన్ ఘీసింగ్‌లను ప్రతిపాదించినప్పటికీ.. ఆందోళనకారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వీరితో పాటు మరికొందరి పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలపై నేపాల్ ఆర్మీ స్పందిస్తూ.. వివిధ భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరుపుతున్నామని తెలిపింది.

మరోవైపు నేపాల్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు 34 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1338 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకోగా, వీరిలో 949 మంది ఇప్పటికే కోలుకున్నట్లు తెలిపింది.

# విద్యార్థి అనుమానాస్పద మృతి

**హనుమకొండ:** హనుమకొండ నైమ్‌నగర్‌లోని తేజస్వి హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న పోలేపల్లి జయంతి వర్ధన్ (15) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అకస్మాత్తుగా విద్యార్థి ముక్కు, చెవి నుంచి రక్తం రావడంతో గుర్తించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే, విద్యార్థి మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పనిచేస్తున్న ఇంటికే కన్నం వేసిన మహిళ..

**కాకినాడ:** పనిచేస్తున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన పని మనిషిని కాకినాడ పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడలోని కనకదుర్గ ఇంట్లో జగదాంబ అనే మహిళ గత పదేళ్లుగా పనిచేస్తోంది. కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా.. కనకదుర్గ ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. ఆమె పూజ చేసుకుంటున్న సమయంలో.. ఇంట్లో ఉన్న 277 గ్రాముల బంగారం, రూ.లక్ష నగదును పనిమనిషి జగదాంబ అపహరించింది. బంగారం, డబ్బు కాజేసి ఏమీ తెలియనట్టు పనిలోకి వచ్చింది. కనకదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చోరీకి పాల్పడింది జగదాంబగా గుర్తించి అరెస్టు చేశారు.

# ప్రభుత్వ విజయాల్లో ..కలెక్టర్లే కీలకం

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి:లి ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం మాట్లాడారు. సమర్ధవంతమైన పాలన అందించే విషయంలో వారికి దిశా నిర్ధేశం చేశారు. 360 డిగ్రీల్లో పనితీరు పరిశీలించి మీకు కలెక్టర్లుగా అవకాశం ఇచ్చాను...నా ఆలోచనలు, అంచనాలు అందుకోండి...బెస్ట్ పెర్ఫామెన్స్ ఇవ్వండి అని సిఎం సూచించారు. సిఎం అంటే కామన్ మ్యాన్ అని నేను చెపుతున్నా... మీరూ అదే పాటించండి... ప్రజలకు అందుబాటులో ఉండండి.... నిత్యం వారితో మమేకం అవ్వండి... అన్నింటికీ రూల్స్ కాదు... మానవీయ కోణంలో పనిచేయండి. అప్పుడే మీకు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది అని సిఎం అన్నారు.



**ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలి :** కలెక్టర్లుగా పోస్టింగులు ఇస్తున్న సందర్భంగా సిఎం మాట్లాడుతూ" నేను 1995లో మొదటి సారి సిఎం అయ్యాను. 30 ఏళ్లలో 15 ఏళ్లు సిఎంగా ఉన్నాను. ఎంతో మంది అధికారులను నియమించాను. చాలా మందితో పనిచేయించుకున్నాను. అయితే ఈ సారి కలెక్టర్లకు పోస్టింగ్ ల విషయంలో మరింత గట్టి కసరత్తు నిర్వహించాను. గతంలో ఎప్పుడూ ఇంత కసరత్తు చేయలేదు. దీనికి కారణం ఉంది. అనేక సమస్యల మధ్య ఏడాది క్రితం మనం పాలన ప్రారంభించాం. ప్రజలు మాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిని తీర్చాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వీటిని మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే కలెక్టర్లే కీలకం. మీ పనితీరే ప్రభుత్వానికి విజయాలను తెచ్చి పెడుతుంది. 1995లో తొలి సారి సిఎంగా ఉన్నప్పుడు చాలా ధృడంగా, కఠినంగా ఉండేవాడిని. ఫైల్స్ క్లియరెన్స్ వంటి కార్యక్రమాలతో అధికారులను పరుగులు పెట్టించే వాడిని. పని విషయంలో ఎక్కడా రాజీ ఉండేది కాదు. ఆ పనితీరు అధికారులకు, ఉద్యోగులకు కొంత కష్టంగా అనిపించినా ప్రగతిలో మార్పు కనిపించింది. అభివృద్ధి వేగవంతం అయ్యింది. అదొక్కటే కాదు... ఎప్పుడు విపత్తు ఉన్నా అధికారులకంటే ముందు నేను వెళ్లే వాడిని... తుఫాన్లు, వరదలు, విపత్తులు వచ్చినప్పుడు ముందు నేనే వెళ్లే వాడిని. విశాఖలో హుద్ హుద్ సమయంలో ఫ్లైట్ కూడా వెళ్లని పరిస్థితుల్లో ముందుగా వెళ్లి 10 రోజులు అక్కడే ఉన్నాను. ఇలాంటి చర్యల వల్ల ప్రజలకు ఆందోళన పోతుంది. ప్రభుత్వం సాయం చేస్తుంది అనే నమ్మకం కలుగుతుంది. స్పందించే ప్రభుత్వంగా అంతా గుర్తిస్తారు. అధికారంలో రిస్క్ ఉంటుంది. లీడర్స్ అనే వాళ్లు రిస్క్ తీసుకోవాలి అప్పుడే ఫలితాలు వస్తాయి. ఫ్యాక్షన్, నక్సలిజం, మత ఘర్షణల విషయంలో సమర్ధులైన అధికారులకు స్వేచ్ఛనిచ్చి పనిచేయించాను. దీంతో ఫలితాలు వచ్చాయి. అధికారుల సహకారం, సమన్వయం, మంచి టీంతోనే నేను ఫలితాలు సాధించాను" అని చంద్రబాబు నాయుడు అన్నారు

**మీరే నాం టీమ్ :** "కలెక్టర్ గా పనిచేయడం అంటే మీకు మంచి గుర్తింపు వస్తుంది. ప్రజల జీవితాల్లో మార్పులు తేవడానికి మంచి అవకాశం కలెక్టర్ ఉద్యోగం. మీరు క్షేత్ర స్థాయిలో పనిచేస్తే ప్రతిదానిలో మార్పు చూపించవచ్చు. సాంఘీక సంక్షేమ హాస్టల్ కు వెళ్లి వసతులు చూడండి. ప్రభుత్వ ఆస్తులు రక్షించడంలో మీరే కీలకం. నాడు హైదరాబాద్ లో ఒక అధికారి ఉండే వారు... ఆయనకు పూర్తి అధికారాలు ఇచ్చాను. దీంతో ల్యాండ్ మాఫియాకు చెక్ పెట్టారు. కబ్జాదారులపై ఉక్కుపాదం మోపారు. ఒక తాహసీల్దారు బదిలీ అయితే కొత్తగా వచ్చే వాళ్లు.... ల్యాండ్ రికార్డులు అప్పగించడమే కాదు....క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రభుత్వ ఆస్తులు చూపించి వాటి రక్షణ అంశాలు వివరించి బాధ్యతలు అప్పగించే వారు. ఆ స్థాయిలో పనిచేశాం కాబట్టే నాడు ఫలితాలు చూపించాం. కలెక్టర్లుగా మీరు బాధ్యతగా, పారదర్శకంగా ఉంటే... మీ కింది అధికారులు కూడా వాటిని పాటిస్తారు. మీరు వారిలో స్ఫూర్తి నింపాలి. జిల్లా కలెక్టర్ల ఎంపికలో నాకున్న అవకాశాల్లో మీరే బెస్ట్ ఆప్షన్స్ అని సెలక్ట్ చేశాను, మీరు బెస్ట్ ఫెర్మామెన్స్ చూపాలి. నాలుగో సారి ముఖ్యమంత్రిగా ఉన్న నా టీం మీరే. పనిచేస్తే ప్రోత్సహిస్తా.....ఆశించిన ఫలితాలు రాకపోతే మాత్రం క్యారీ చెయ్యను. ఇదే సమయంలో నేను పొలిటికల్ గవర్నెన్స్ అని చెపుతున్నా. ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పిన దాంట్లో మంచి చెడు చూడండి...ప్రజలకు ఉపయోగపడేది అయితే మానవీయ కోణంలో పనిచేయండి. నేను తప్పు చేయమని చెప్పను. పొలిటికల్ గవర్నెన్స్ అంటే తప్పు చేయమని కాదు. కలిసి పనిచేయమని. ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం వారికి ఇవ్వండి. పొలిటికల్ గవర్నెన్స్ చేసిన సమయంలో నేను ఓడిపోలేదు... ఎక్కువ బ్యూరో క్రటిక్ గవర్నెన్స్ చేసినప్పుడే రాజకీయంగా నష్టపోయాను" అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఇతర జిల్లాలతో పోటీ పడండి :** "మీ నిర్ణయాలు క్రియేటివ్ గా, ఇన్నోవేటివ్ గా ఉండాలి... కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి... ప్రతి దానికీ డబ్బులు లేవు అని కూర్చుంటే పని అవ్వదు. నేను అన్ని రాష్ట్రాల కంటే ఏపీ నెంబర్ 1 గా ఉండాలి అని అందరితో పోటీ పడుతుంటా.... మీరు కూడా అన్ని జిల్లాల కంటే ముందు ఉండాలని ఇతర జిల్లాలతో పోటీ పడాలి. ముందుండాలి అనే కసి, పట్టుదల మీకు కనిపించాలి. అసత్యాలు ప్రచారం చేసే మీడియా, సోషల్ మీడియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఫస్ట్ అవర్ లోనే మీరు రెస్పాండ్ అవ్వాలి. మనం చేసేది ప్రజల్లోకి వెళ్లాలి.... లేకపోతే అసత్యాలే నిజం అని ప్రజలు నమ్మే అవకాశం ఉంది. కలెక్టర్ అనేది అధికారం కాదు. అహంకారం, ఈగోలు వద్దు.... కామన్ మ్యాన్ గా ఉండాలి" అని సిఎం అన్నారు.

# అన్నదాతను నాడు ముంచారు..



**మంగళగిరి,(జర్నలిస్ట్ ఫైల్):** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019–24 మధ్య ఐదేళ్ల పాలనలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని, ఈ దుస్థితిని ప్రజలు అనుభవించారని వ్యాఖ్యానించారు. జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వమని అడుగుతున్నారని, కానీ ఆ హోదా తాము ఇచ్చేది కాదని, అది ప్రజలు ఇచ్చేదని స్పష్టం చేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ డిపాజిట్లు కోల్పోయిన తర్వాత జగన్ పిచ్చి మరింత ముదిరిందని, అందుకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. వారంలో ఒకరోజు వచ్చి పూర్తిగా అబద్ధాలు చెప్పి, మళ్లీ బెంగళూరు వెళ్లిపోతున్నారని, 16 నెలలుగా ఇదే కొనసాగుతోందని అన్నారు. ఈ అబద్ధాలను నమ్మి ప్రజలు మళ్లీ మోసపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం తరపున వాస్తవాలను తెలియజేస్తున్నామని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి నిన్న మీడియా సమావేశంలో వైద్య కళాశాలలు, రైతుల సమస్యలపై మాట్లాడారని అయితే ఈ రెండింటిపైనా ఆయనకు కనీస అవగాహన లేదని మండిపడ్డారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని, ఆయన పాలనలో ఎవరైనా బయటికి వచ్చి మాట్లాడే అవకాశం ఇచ్చారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్క రైతు కూడా రోడ్లమీదికి రాలేదని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని, ఇది విడ్డూరంగా ఉందని అన్నారు. యూరియా సమస్యపై జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం యూరియా వాడకాన్ని తగ్గించాలని నిర్ణయించిన తర్వాత రైతులు ఆందోళన చెందారని దీనికి తోడు కొన్ని ఫేక్ మీడియా ఛానెళ్లు, పత్రికలు యూరియా దొరకడం లేదని దుష్ప్రచారం చేశాయని అన్నారు. అలాగే కొన్ని జిల్లాల్లో అకాల వర్షాల వల్ల, మరికొన్ని జిల్లాల్లో ముందుగా వర్షాలు రావడంతో యూరియాకు డిమాండ్ పెరిగిందని, దీనివల్లే ఒకటి రెండు వారాలు సమస్య ఏర్పడిందని వివరించారు. ఈ సమస్యను భూతద్దంలో చూపించి రైతులు అల్లాడిపోతున్నారని జగన్ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

జగన్ సాక్షి పత్రికలో ప్రచురించిన తప్పుడు ఫోటోలు, వీడియోలు చూపిస్తూ రాష్ట్ర రైతులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ప్రయత్నాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 6.22 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రభుత్వం ముందు జాగ్రత్తగా 7.19 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ చేసిందని తెలిపారు. ఇప్పటివరకు 6.41 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశామని ఇంకా 78 వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉందని చెప్పారు. సెప్టెంబర్ 22 నాటికి మరో 55,115 మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి వస్తున్నాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డి బతుకే అవినీతి, నీ పార్టీ అవినీతి అంటూ విమర్శలు గుప్పించారు. యూరియాలో రూ.250 కోట్ల అవినీతి జరిగిందని జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, రైతులకు ఇచ్చే దానిపై ఎవరైనా అవినీతి చేస్తారా అని ప్రశ్నించారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 70% యూరియా మార్క్‌ఫెడ్ ద్వారా, 30% ప్రైవేటు డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్నామని, ఎక్కడా అధిక ధరలు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని, అయినప్పటికీ తమ ప్రభుత్వం వాటిని అధిగమించడానికి కృషి చేస్తోందని వివరించారు. మిర్చి, కొబ్బరి, నల్లబర్లీ, టమోటా, ఉల్లి వంటి పంటలకు ధరలు తగ్గినప్పుడు తమ ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో మామిడి ధర తగ్గితే ఒక్క మామిడి కాయైనా కొన్నావా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఉల్లి ధరలు పడిపోయినప్పుడు కనీసం సమీక్ష కూడా చేయని జగన్, నిత్యం ప్రజల గురించి, రైతుల గురించి పనిచేస్తున్న తమ ప్రభుత్వాన్ని విమర్శించడం దౌర్భాగ్యమని అన్నారు.

జగన్ మెడికల్ కాలేజీలకు పునాదులు వేసి వెళ్లారని, కానీ వాటి నిర్మాణాలు పూర్తి చేయలేదని విమర్శించారు. ఇప్పుడు తాము పీపీపీ (పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) మోడల్‌లో వాటిని పూర్తి చేయాలని ప్రయత్నిస్తే అధికారంలోకి వస్తే రద్దు చేస్తానని జగన్ బెదిరిస్తున్నారని అన్నారు. పీపీపీ మోడల్‌లో 50% సీట్లు ప్రభుత్వానికి ఉంటాయని, అయినా జగన్‌కు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. అలాగే నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించడానికి యువ నాయకుడు నారా లోకేష్ చేస్తున్న కృషిని అచ్చెన్నాయుడు అభినందించారు. సూపర్ సిక్స్ సభకు ముఖ్య అతిథిగా వెళ్లాల్సిన లోకేష్, తెలుగువారిని రక్షించడమే తన బాధ్యతగా భావించి ఇక్కడే ఉండి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఇదే నిజమైన నాయకత్వమని, కేవలం అధికారం ఉంటేనే పనిచేస్తాననే ఆలోచన సరైంది కాదని జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లో వరదల సమయంలో నాటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు గారు మానవతా దృక్పథంతో వ్యవహరించిన తీరును ప్రశంసించారు. ఆ సమయంలో చంద్రబాబు గారు తమ చేతిలో ఒక్క పైసా కూడా లేకపోయినా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఉత్తరాఖండ్‌లో చిక్కుకుపోయిన తెలుగువారిని రక్షించాలని దృఢ సంకల్పం తీసుకున్నారని తెలిపారు. పది మందితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి వారిని ఉత్తరాఖండ్‌కు పంపి, అక్కడ చిక్కుకున్న తెలుగువారిని సొంత డబ్బులతో విమానాల్లో సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఇది నాయకత్వానికి అసలైన నిదర్శనం అని కేవలం అధికారం ఉన్నప్పుడే కాకుండా, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడమే నిజమైన నాయకుడి లక్షణమని అన్నారు. గత ఎన్నికల్లో 11 ఎమ్మెల్యేలు మాత్రమే గెలిచి ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్ గౌరవించకుండా, ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని అసెంబ్లీకి రానని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 18 నుంచి అసెంబ్లీ ప్రారంభమవుతుందని, జగన్ వచ్చే ప్రతి మాటకు తాను సమాధానం ఇస్తానని సవాల్ విసిరారు. రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

# నీ బెదిరింపులకు భయపడరు

**పెనుకొండ/శ్రీసత్యసాయి,(జర్నలిస్ట్ ఫైల్):** పీపీపీ మోడల్ ద్వారా కూటమి ప్రభుత్వం నిర్మించతలపెట్టిన 10 మెడికల్ కాలేజీల టెండర్లలో పాల్గొనొద్దంటూ జగన్ హెచ్చరికలు చేయడం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీ బెదిరింపులకు రాష్ట్రంలో భయపడే వారెవరూ లేరు... బావిలో ఎవరి పడి చావాలో ఇప్పటికే ప్రజలు స్పష్టమైన తీర్పు చెప్పారు' అంటూ జగన్ ను మంత్రి సవిత ఎద్దేవా చేశారు. తన నీలి మీడియాలో 17 మెడికల్ కాలేజీ నిర్మించానని ఆహా... ఓహో.. అని జగన్ రాయించుకోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని దెప్పి పొడిచారు. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్–సూపర్ హిట్ విజయోజత్సవ సభ మెగా హిట్ అయ్యిందని, ఇది చూసి ఓర్వలేక జగన్ విషం కక్కుతున్నాడని విమర్శించారు. పెనుకొండలో పునాదుల దశలోనే నిలిచిపోయిన మెడికల్ కాలేజీని కూటమి నాయకులతో కలిసి మంత్రి సవిత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. 2021 లో 17 మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నానంటూ ఆనాడు జగన్ రెడ్డి ఆర్భాటంగా గాల్లో వచ్చి శంకుస్థాపన చేశారన్నారు. రెండేళ్లలో పూర్తి చేస్తామని డబ్బా కొట్టారన్నారు. ఆయన పదవీ కాలం పూర్తయినా ఏ ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, నాబార్డు నిధులతో మాత్రమే విజయనగరం, నంద్యాల, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం మెడికల్ కాలేజీలను అసంపూర్తి నిర్మించి, ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించేశాడని మండిపడ్డారు. పార్వతీపురం మెడికల్ కాలేజీ నిర్మాణానికి కనీసం టెండర్ కూడా పిలవలేదన్నారు. మెడికల్ కాలేజీలు మాత్రమే కాకుండా బీసీ భవనాలు, బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లు, ఇతర భవనాలను సైతం నిధులున్నా కూడా పూర్తి



చేయలేదన్నారు. టీడీపీకి మంచి పేరు వస్తుందనే అసూయతో ఆ భవనాలను పట్టించుకోలేదన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదికను కూల్చడం జగన్ కు తెలుసని, భవన నిర్మాణాలు మాత్రం చేతకాదని మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

**గతంలోనూ జగన్ అవాకులు చవాకులు :** ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 10 మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్ ద్వారా నిర్మించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారని మంత్రి సవిత వెల్లడించారు. ఈ నిర్ణయంపై జగన్ విషం కక్కుతున్నారని ఆమె మండిపడ్డారు. ప్రజారోగ్యం మెరుగుపడడం జగన్ కు ఇష్టంలేదన్నారు. అందుకే, మెడికల్ కాలేజీల నిర్మాణానికి టెండర్లు వేస్తే, తమ ప్రభుత్వం వస్తే రద్దు చేస్తానని హెచ్చరికలు దిగుతున్నాడని అన్నారు. పోలీసులను, ఉద్యోగులను బెదిరించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. జగన్ బెదిరింపులకు రాష్ట్రంలో భయపడేవారేవరూ లేరన్నారు. కియా పరిశ్రమ నిర్మాణం సమయంలోనూ జగన్ ఇటువంటి అవాకులు చవాకులు పేలాడని అన్నారు. కియా పరిశ్రమకు ఇచ్చిన భూములు తిరిగి ఇప్పించేస్తానని ఆనాడు చెప్పాడన్నారు. కియా, దాని అనుబంధ పరిశ్రమల వల్ల లక్షలాది మందికి ఉపాధి లభ్యమవుతోందన్నారు. జీఎస్టీ, పన్నుల రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తోందన్నారు. కియా పరిశ్రమ వల్ల జగన్, ఆయన బ్యాచ్ ఎక్కువగా లబ్ధిపొందింది అని అన్నారు.

**బావిలో పడి ఎవరు చావాలో ప్రజలు అల్రెడీ తీర్పిచ్చారు... :** సీఎం చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్ ను, మంత్రి అచ్చెన్నాయుడునే బావిలో పడి చావాలని జగన్ అనడంపై మంత్రి సవిత తీవ్రంగా స్పందించారు. ఇదేనా ఎమ్మెల్యేగా మాట్లాడే తీరు అంటూ మండిపడ్డారు. బావిలో ఎవరి పడి చావాలో గత సాధారణ ఎన్నికల్లోనూ, ఇటీవల జరిగిన పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే స్పష్టమైన తీర్పు చెప్పారని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురించి జగన్ కు మాట్లాడే అర్హత లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు

**ఇదేనా ఆహా... ఓహో అంటే..? :** అంతకుముందు కూటమి నాయకులతో కలిసి పెనుకొండలోని పునాదుల దశలోనే నిలిచిపోయిన మెడికల్ కాలేజీని మంత్రి సవిత పరిశీలించారు. అక్కడికి వచ్చిన మీడియా కూడా మెడికల్ కాలేజీ దుస్థితిని చూపించారు. తన సొంత నీలి మీడియాలో మెడికల్ కాలేజీలను నిర్మించానంటూ కథనాలు రాయించుకోవడంపై జగన్ ను విమర్శించారు. ఇదేనా ఆహా... ఓహో....? అంటూ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా సీఎం చంద్రబాబునాయుడు 27 మెడికల్ కాలేజీలు నిర్మించారన్నారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే రాష్ట్రంలో వైద్య విద్య అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలను నిర్మించి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**'సూపర్ సిక్స్- సూపర్ హిట్' మెగా హిట్ :** అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపర్ సిక్స్– సూపర్ హిట్ విజయోత్సవ సభ మెగా హిటయ్యిందని మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలొచ్చారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంద, ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేశామని వెల్లడించారు. సంక్షేమంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కూడా పరుగులు తీస్తోందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నైతిక విజయం ఇండియా కూటమిదే
### తెలంగాణ ఎంపిల కన్వీనర్ మల్లురవి
### విజయాలు అంతిమ అజెండా కాదు: చామల

**హైదరాబాద్,సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ఉపరాష్ట్రపతి ఎన్నికలలో సైద్ధాంతికంగా నైతికంగా ఇండియా కూటమికి విజయం లభించిందని తెలంగాణ ఎంపిల కన్వీనర్ మల్లురవి అన్నారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లౌకిక పార్టీలను కూడగట్టి సమన్వయంతో ఎన్నికల పోరాటం చేసిందని అన్నారు. ఓ ఆదర్శవంతమైన అంశాన్ని 'ఇండియా' కూటమి దేశ ప్రజల ముందుంచిందని ఆయన తెలిపారు. భువనగిరి ఎంపి చామల కిరణ్‌కు మార్ రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ విజయాలు అంతిమ ఎజెండా కాదు అని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటం కోసం ప్రయత్నం మొదలైందని తెలిపారు. ఈ దేశ ప్రజలు వినడానికి ఒక స్వరం, ఓటు వేయడానికి ఒక స్వరం ఉండేలా చూసుకోవడం ఇండియా కూటమి ఎజెండా అవుతుందని ఆయన తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో ముఖ్యంగా బి. సుదర్శన్ రెడ్డితో చర్చలు జరపడానికి మేము మా వంతు ప్రయత్నం చేసాము, వారికి అపారమైన మద్దతు లభించింది.బహుశా నేడు కొంతమంది సభ్యులు ఓటువేసి ఉండకపోవచ్చు. కానీ ఆయన దేశ వ్యాప్తంగా పర్యటించినప్పుడు అఖండ స్పందన వచ్చిందని చామల అన్నారు. కొత్తగా ఎన్నికైన ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఇండియా కూటమి అభినందించిందని తెలిపారు.

## సిఎంతో నే తెలంగాణ యువతకు భరోసా
### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

**హైదరాబాద్, సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** రేవంత్‌రెడ్డితోనే తెలంగాణ యువతకు భరోసా ఉంటుందని,బిఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టేమాటలు నమ్మకండని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ మక్కాన్ సింగ్ అన్నారు. గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ మాట్లాడుతూ టిజిపిఎస్‌సిపై హైకోర్ట్ చెప్పిన తీర్పులో కాంగ్రెస్‌పార్టీని కానీ ప్రభుత్వాన్ని ఎక్కడ ఒక్క మాట అనలేదని ఆయన వివరించారు. ఏలాంటి అవకతవకలు జరగలేదు లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరిస్తున్నాను అవాస్తవాలు రెచ్చగొట్టే మాటలు మానుకో లేదంటే మాటలు కాదు చేతలతో చూపించాల్సి వస్తది జాగ్రతా అని ఆయన అన్నారు. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ఏ నిరుద్యోగికి నష్టం జరగకుండా చూసుకుంటుందని అన్నారు. మా ప్రభుత్వం ఈ ఫార్ములా కేసువిచారణ చేపడుతోందని, పాడి కౌశిక్ మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని ఆయన సూచించారు.



స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్సీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలలో ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

## సంస్కారం లేని విద్య ఎందుకూ పనికిరాదు
### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** విద్యతో పాటు ప్రతి ఒక్కరూ సంస్కారం అలవర్చుకోవాలని, సంస్కారం లేని విద్య ఎందుకూ పనికిరాదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బుధవారం దోమలగూడలోని రామకృష్ణ మఠంలో స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్సీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైె వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను, కుటుంబ వ్యవస్థను కాపాడుకోవల్సిన అవసరం ఉందని, అందుకే తన వంతుగా వీటిని నేటి యువతకు తెలియచేయటం కోసం దేశవ్యాప్తంగా తిరుగుతున్నానని తెలిపారు. తాను పదవి నుంచి విరమణ పొందానని, పెదవి నుంచి కాదని, అందుకే నాకు తెలిసిన మంచి విషయాలను యువతకు తెలియచేయటం కోసం కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద, స్వామి నిత్యాముక్తానందజీ, స్వామి జ్ఞానానందజి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

**హైదరాబాద్,సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** 22 కేజీలగంజాయిని ఒడిశా నుంచి తీసుక వచ్చి సంగారెడ్డిలో అమ్మకాలకు పాల్పడుతూ పట్టుబడినముగ్గురికి సంగారెడ్డి ఫస్ట్‌క్లాస్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్ కోర్టు న్యాయమూర్తి కె. జయంతి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. 2018లో ఈ కేసు సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐగా పని చేసిన మధుబాబు కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖాలు చేశారు. 47/2018ఈ కేసులో ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన పరిమిల్ భద్రా, కరువ సర్కార్, మదాపు మండల్ నిందితులుగా ఉన్నారు. వీరికి సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి మంగళవారం సాయంత్రం తీర్పు వెలువరించారు. గంజాయి నిందితులకు శిక్ష పడేవిధాంగా చర్యలు చేపట్టిన సీఐ మధు బాబు, సిబ్బందిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షానవాజ్ ఖాసిం,మెదక్ జిల్లా డిప్యూటి కమిషనర్ జె.హరి కిషన్,ఈఎస్ నవీన్‌చంద్రా అభినందించారు.

బాలనగర్‌లో 710కేజీల గంజాయి పట్టివేత.బాలనగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సుచిత్ర డైరీ ఫార్మ్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ సీ టీమ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మంజు సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. అకారం రంజిత్ వ్యక్తి 710 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని, నిందితుడిని బాలనగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## మేడారం మాస్టర్ ప్లాన్ ఖరారుకాలేదు: మంత్రి సీతక్క

**హైదరాబాద్,సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీకగా, సమక్క-సారలమ్మ తల్లుల త్యాగాల స్ఫూర్తిని ప్రతిబింబించే మేడారం మాస్టర్ ప్లాన్ డీపీఆర్ ఇంకా తుది రూపం దాల్చలేదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,మహిళా-శిశు సంక్షేమశాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. దీనిపై అనవరసర రాద్ధాంతం చేయడం తగదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి మేడారం పర్యటన అనంతరం మాస్టర్ ప్లాన్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.సమక్క-సారలమ్మల త్యాగాలు, ఆదివాసీల అచంచలమైన తెగువ, వారి పోరాట స్ఫూర్తి ప్రతిఫలించేలా మేడారం మాస్టర్ ప్లాన్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో సమ్మక్క సారలమ్మ తల్లుల పూజారుల సూచనలు, రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటివారి ప్రమేయం ఉండదని ఆమె స్పష్టం చేశారు.

## అనిల్ యాదవ్‌కు సోనియా ఆశీస్సులు
### స్వీట్ తినిపించిన ఖర్గే



**హైదరాబాద్, సెప్టెంబరు(జర్నలిస్ట్‌ఫైల్) 11:** రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్‌కు ఎఐసిసి అగ్రనేత సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా ఆయురారోగ్యాలతో జీవించాలని దీవెనలు బుధవారం అందజేశారు. ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్ జన్మాదినోత్సవం సందర్భంగా కేసి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ తదితరులు అభినందించారు.

# వరదసహాయ చర్యలను ముమ్మరం చేయండి
### రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బుధవారం సచివాలయంలో వరదసాయక చర్యలపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ఇటీవల రాష్ట్రంలో ప్రధానంగా కామారెడ్డి,మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.సిఎం రేవంత్ రెడ్డి సూచనలతో బుధవారం డాక్టర్‌బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం,ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖలవారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు,రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సుల్తానియాతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో చాలా వరకు ప్రాణ,ఆస్తి నష్టం తగ్గిందన్నారు.సహాయక పనులను మరింత వేగవంతం చేయాలని ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయక పోతే వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. ఏ ఒక్క బాధితుడు పరిహారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలతో తీవ్రంగాదెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు,సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లను విడుదల చేశామన్నారు.సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని హైదరాబాద్‌నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యూసీలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమావేశంలో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు.అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయితీరాజ్, హెల్త్, మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష**

నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐ పిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక, సీపీఆర్‌వో జి.మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వ హించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ,జర్నలిస్టుల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికా రులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

## ఎల్లంపల్లిని ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేసిన కెసిఆర్
### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ఎల్లంపల్లి ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించకుండా కెసిఆర్ నిర్లక్ష్యం చేశారని కాళేశ్వరం ప్రారంభోత్సవానికి మాత్రం ఇద్దరు ముఖ్యమంత్రులను తీసుకొచ్చారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం సిఎల్‌పి మీడియా సెంటర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టును మేమే నిర్మించామన్నట్లుగా హరీష్ రావు తెగ ఊదరగొడుతున్నాడని ఎల్లంపల్లికి బిఆర్ఎస్‌కు ఏం సంబంధం? ఎల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అని అన్నారు. 2004 జూలై28 అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లికి శంకుస్థాపన చేశారని, నిర్మాణం పూర్తి చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అని చరిత్రను వివరించారు.ఎల్లంపల్లిని ప్రారంభిస్తే కాంగ్రెస్ కు పేరు వస్తుందన్న భయంతో ఇప్పటి వరకు అధికారికంగా ప్రారంభోత్సం లేకుండా చేశారని ఆవేదన చెందారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎల్లంపల్లితో ఏలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు.ప్రాణహిత చేవేళ్ల ను రద్దు చేసి కెసిఆర్ కాళేశ్వరం తీసుకువచ్చాడని అన్నారు.. లక్షన్నర కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే బ్యారేజీలు పనికి రాకుండా పోయాయని ఆవేదన చెందారు.తెలంగాణ ప్రజల సొమ్ముతో నిర్మించిన రిజర్వాయర్లు, కాలువలను కూడా ఉపయోగించుకోవద్దని హరీష్ రావు అంటున్నాడని ఆరోపించారు. మల్లన్న సాగర్ 50 టిఎంసిల సామర్థంతో నిర్మించడం వల్లే గోదావరి జలాలు ఫేజ్ 2 ను మల్లన్న సాగర్ నుంచి తీసుకుంటున్నామని ఆయన అన్నారు. కాళేశ్వరం నిర్మించింది తమరే,కూల్చింది కూడా తమరే ఈ విషయం తెలంగాణ ప్రజలకు తెలుసు నువ్వు కాళేశ్వరరావు కాదు నువ్వు కరప్షన్ రావు, కలెక్షన్ రావు అని కవితనే సర్టిఫికెట్ ఇచ్చిందని ఆయన అన్నారు.అయినా సిగ్గులేకుండా మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నావు..కరప్షన్ రావు ముందు కవితారావు అడిగిన ప్రశ్నలకు ప్రెస్ మీట్ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కవిత చెప్పింది అబద్ధమైతే ఆమె పైన పరువు నష్టందావా వేయ్యాలని సూచించారు. కోర్టుకు ఈడ్చుఆమె ఇంటి ధర్నా చేయి,క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయి అని అన్నారు. హరీష్ రావు నీకాళేశ్వరం కహానీలను సిబిఐ త్వరలోనే తేల్చుతుందని మీలాగాదోచుకుతినే బుద్ధి మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని ఆయన అన్నారు.

## అమరవీరుల జ్ఞాపకార్థం స్థూపం ఏర్పాటు: విహెచ్

**హైదరాబాద్ సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని 1948లో స్వాతంత్ర ఉద్యమంలో అసువలు బాసిన 10 మంది అమరవీరులు జ్ఞాపకార్థం స్థూపాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. భారత దేశానికి 15 ఆగస్టు 1947 లో స్వాతంత్రం వచ్చిన ఆ నాడు ఇక్కడ నిజం సర్కారు రజాకర్ల పాలన కొనసాగించిన సమయంలో శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ప్రస్తుతం ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 1948లో జాతీయ జండా ఎగురవేసినందుకు నిజం సర్కారు సైనికులు కాల్పులు జరపగా 10 మంది బలైన సంఘటన స్థలంలోనే, వారి జ్ఞాపకార్థంగా ఈ స్థూపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వి.హెచ్ తెలిపారు.భారతదేశ స్వాతంత్ర ఉద్యమ చరిత్రను వెలికి తీసి ఉల్లాల గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ స్థూపని ఈ శుక్రవారం 12 సెప్టెంబర్ రోజున 03:30 గంటలకు, టిపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇంచార్జి విశ్వనాథ్ తో పాటు నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు, ఇంచార్జి మంత్రి, జిల్లాకు సంబంధించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొంటారు.కావున కాంగ్రెస్ నాయకులు, సేవాదళ్, మహిళా, యువజన కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళాలు అర్పించాలని వి.హెచ్ కోరారు.



అమరవీరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేయబోయే స్థూపం

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆధార్ కార్డులో తప్పులు సరి చేయండి
### కలెక్టర్లను ఆదేశించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్

**హైదరాబాద్,సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారులకు నగదు చెల్లింపు అంశంలో అవకతవకలు జరగకుండా చూడటం కోసం ఆధార్ ఆధారిత పేమెంట్స్‌ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ విధానంలో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. చాలా మంది లబ్ధిదారులు వివరాలు.. వారి ఆధార్ కార్డ్ వివరాలతో సరిపోలడం లేదు. దీంతో పేమెంట్స్ ఆగిపోయి.. లబ్ధిదారులు ఆందోళన పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందిరమ్మ ఇళ్ళ పథకం అమలును.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. సొంతంగా ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థికంగా సాయం చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు కూడా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. తొలి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ప్రస్తుతం ఇవన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయి. కొన్ని పూర్తి కావొచ్చాయి కూడా. ఇక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర సర్కార్ రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కీలక అలర్ట్ జారీ చేసింది. మరీ ముఖ్యంగా ఆధార్ కార్డుల్లో తప్పులున్న వారి కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నగదు చెల్లింపుల కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. లబ్ధిదారులకు సంబంధించి నగదు చెల్లింపులను ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీని వల్ల పథకం అమలులో పారదర్శకతతో పాటు వేగంగా చెల్లింపులు చేసేందుకు వీలుగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. అయితే ఇప్పుడు ఇదే పెద్ద తలనొప్పి వ్యవహారంగా మారింది. ఆధార్ ఆధారిత చెల్లింపుల నేపథ్యంలో చాలా వరకు లబ్ధిదారుల వివరాలు.. వారి ఆధార్ కార్డ్‌లో ఉన్న వివరాలతో సరిపోలడం లేదని తెలుస్తోంది. మొత్తం లబ్ధిదారుల్లో సుమారు 30 శాతంమంది ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఆధార్ వివరాలు సరిపోకపోవడం వల్ల.. పేమెంట్స్ ఆగిపోతాయని అధికారులు చెప్పుకొస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారికి ఊరట కలిగించే ప్రకటన చేసింది. లబ్ధిదారుల ఆధార్ వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లనిర్మాణం పనులు వేగం పుంజుకుంటున్నాయి. ఇప్పటికే కొందరు ఇంటి నిర్మాణం పూర్తి చేయగా.. మరికొన్ని ఇళ్ల విషయానికి వస్తే బేస్‌మెంట్,గోడలు,స్లాబ్ లెవల్‌లో నిర్మాణాలు ఉన్నాయి. త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు కోరుతున్నారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నారు. ఈక్రమంలో అధికారులు ఇంటి నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

## మానసిక సమస్యలకు టెక్నాలజీ పరిష్కారం చూపించగలదు: మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** సమాజంలో వేగంగా పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన తదితర మానసిక సమస్యలకు పరిష్కారం చూపించగల సామర్థ్యం టెక్నాలజీకి ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఏఐ ఆధారిత మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం హోప్ ఐను ఆయన బుధవారం రాయదుర్గంలోని టి హబ్‌లో లాంఛనంగా ఆవిష్కరించారు. ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా వివరించారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆ దిశగా దృష్టి సారించి ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవాలని యువ ఆవిష్కర్తలకు సూచించారు.

కార్యక్రమంలో టి హబ్ సిఈఓ కవి కృత్, సైబర్‌హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పెట్రోలియం, గ్యాస్ సరఫరా, రవాణా భద్రతపై సమీక్ష




ఆన్‌షోర్ సెక్యూరిటీ కో..ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి జితేందర్, చిత్రంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులున్నారు

**హైదరాబాద్, సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో పెట్రోలియం, గ్యాస్ రవాణా, సరఫరాకు సంబంధించి డిజిపి జితేందర్ నేతృత్వంలో బుధవారం నాడు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, సిఐడి చీఫ్ చారు సిన్హా, గేల్ సెక్యూరిటీ సలహాదారుగా వున్న సీనియర్ ఐపిఎస్ అధికారి సౌరబ్ తౌలుంబియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ ఆన్‌షోర్‌గా పిలువబడే ఈ సమావేశం పోలీసు శాఖలో ఎంతో ముఖ్యమైనదని అన్నారు. పెట్రోలియం, గ్యాస్ సరఫరా, రవాణా భద్రతకు రాష్ట్రంలో ప్రాధాన్యత వుంటుందని ఆయన పేర్కొన్నారు. భౌతిక భద్రతతో పాటు సైబర్‌కు సంబంధించిన భద్రత కూడా పెట్రో లియం కంపెనీలకు ముఖ్యంగా మారిందని ఆయన తెలిపారు. పెట్రోలియం కంపెనీలకు తెలంగాణలో భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని, అయితే సైబర్ నేరాల విషయంలో మరింత అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందని డిజిపి తెలిపారు. పెట్రోలియం కంపె నీలు భద్రతకు సంబంధించి అత్యున్నత ప్రమాణాలను పాటించాలని ఆయన కోరారు. పెట్రోలియం, గ్యాస్ సరఫరా సమయం లో జరిగే చోరీల విషయంలో కంపెనీలు జాగ్రత్తగా వుండాలని ఆయన కోరారు. ఈ చోరీల వల్ల అనేక సార్లు ప్రమాదాలు జరిగి మర ణాలు సంభ విస్తున్నాయని, ఈ విషయంలో కఠినంగా వుండా లని డిజిపి పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాచ కొండ కమిషనర్ సుధీర్ బాబు, సైబరాబాద్ కమి షనర్ అవినాష్ మొహంతి, కో..ఆర్డినేషన్ ఐజి శ్రీనివాసులు. సిటీ పరిపాలనా విభాగం జాయింట్ పోలీసు కమిషనర్ పరిమళ హన్నా నూతన్, సిఐ సెల్ ఎస్‌పి భాస్కరన్, కమాండ్ కంట్రోల్ ఓఎస్‌డి కమలాసన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించాలి
### రెవెన్యూ మంత్రి పొంగులేటిని కోరిన ట్రెసా

**హైదరాబాద్,సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ పటిష్టతకు అనేక చర్యలు చేపట్టి 5,601 మంది జీపీవో నియామకం, సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చి 33 మందికి పదోన్నతి కల్పించటం పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి, కే గౌతమ్ కుమార్ లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.బుధవారం మంత్రిని సచివాలయంలో కలిశారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు 45 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించారనికొనియాడారు.ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులపై ఉంచిన నమ్మకాన్ని నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసి నిలబెట్టుకుంటామన్నారు. 33 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లకి సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు గా పదోన్నతితో ప్రారంభమైన ఈ ప్రమోషన్ల ప్రక్రియను కింది స్థాయి వరకు కొనసాగించినట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. వెంటనే తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రిని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, డిప్యూటీ కలెక్టర్లు కె.చంద్రకళ, ఉపేందర్ రెడ్డి,రాజేశ్వరి, ట్రెసా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు అన్వర్, సెక్రటరీ వాణిరెడ్డి, మాజీ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు గోల్కొండ సతీష్ ఉన్నారు.

## తలసరి ఆదాయంలో తెలంగాణను నంబర్1గా నిలిపిన సిఎం రేవంత్
### టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక క్రమశిక్షణతో వ్యవసహరించడంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయంలో దేశంలో నెంబర్1 నిలిపారని టిపిసిసి చీఫ్‌బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో అభినందించారు.తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87లకు నమోదు కావడం హర్షణీమని అన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సామాజికన్యాయంతపాటు అభివృద్ధిఫలాలలో అందరికి సమాన అవకాశం కల్పించడానికి అనుగుణంగా పాలనముందుకు సాగుతోందని ఈ ప్రయత్నం విజయంసాధించబోతుందని మహేష్‌కుమార్ ఆశాభావం వ్యక్తంచేశారు.

## కాంగ్రెస్ సంస్థాగత అభివృద్ధికి మహేష్‌కుమార్ కృషి: కంది శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రభుత్వంను పార్టీని సమన్వయం చేస్తూ కాంగ్రెస్‌పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి గతసంవత్సరకాలంగా టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ ఎంతగానో కృషిచేస్తున్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తిచేసుకొన్న సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో "మహా అన్నదానం" నిర్వహించినారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ సంత్సరకాలంగా మంత్రులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ గాంధీభవన్‌కు మంత్రులను తీసుకొచ్చి ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంచారని అన్నారు. ఎఐసిసి ఇంచార్జీతో కలిసి పాదయాత్రలు చేయడం రాత్రి గ్రామాలలో బసచేయడం తెల్లవారి శ్రమదానం చేయడం వంటికార్యక్రమాలు ఆయన పదవికి వన్నెతెచ్చాయని ఆయన కొనియాడారు.

## పనిచేసిన కార్యకర్తలకు చోటు
### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్



**హైదరాబాద్, సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** స్వార్థం లేకుండా, నిబద్ధతతో పని చేసిన కార్యకర్తలకు చోటు కల్పించారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేము ల అశోక్‌అన్నారు. బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సాధారణ కార్యకర్తగా ఉన్న నన్ను బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సందర్భంలో, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావుకి, జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాకి, కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గత 47 సంవత్సరాలుగా స్వయంసేవక్‌గా, 30ఏళ్లుగా బిజెపిలో వివిధ హోదా ల్లో సేవలందిస్తూ, వృత్తిరీత్యా న్యాయవాదిగా ఉన్న నన్ను, దేశం, రాష్ట్రం కోసం ప్రజల అవసరాలను తీర్చే ఆలోచన విధానంతో బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొప్ప బాధ్యతలు అప్పగించడం గర్వకారణంగా ఉందన్నారు. కొంతమంది బిజెపిపై, నూతన కమిటీల విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## గ్రూప్-1 పరీక్ష పత్రాల రీవాల్యూవేషన్‌కు హైకోర్టు ఆదేశించడం ప్రభుత్వానికి చెంపపెట్టు

**హైదరాబాద్, సెప్టెంబరు 11(జర్నలిస్ట్‌ఫైల్):** గ్రూప్-1 పరీక్ష పత్రాల రీవాల్యూయేషన్ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. బుధవారం గ్రూప్-1అభ్యర్థులు తార్నాకలో బిజెపితెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. హైకోర్టు తీర్పుతో ఆనందాన్ని వ్యక్తంచేశారు.అభ్యర్థులు హైకోర్టు తీర్పు వచ్చినందుకు పూర్తి సంతోషం వ్యక్తంచేసి,ఇది బిజెపి నిరంతర పోరాట ఫలితం అని స్పష్టం చేశారు.



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసిన గ్రూప్1 అభ్యర్థులు

# ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

## రైల్వే ప్రయాణికులు, దగ్గరలోని ప్రజలు వినియోగించుకోవాలి

## తపాలా శాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధర మూర్తి






విజయవాడ, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

తపాలా శాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధర మూర్తి, ఆర్ఎంఎస్ 'వై'డివిజన్ కు తనిఖీ నిమిత్తం విచ్చేసి, రైల్వే స్టేషన్ 6వ ప్లాట్ ఫామ్ లోని నేషనల్ సార్టింగ్ హబ్ నందు ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధార్ కేంద్రం ద్వారా రైల్వే ప్రయాణికులు మరియు దగ్గరలోని ప్రజలు వారి నూతన నమోదులు, సవరణలు చేసుకొనవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం బాల సరస్వతి మాట్లాడుతూ 6వ నంబర్ ప్లాట్ ఫారం పై ప్రారంభించిన రిజిష్టర్ పోస్ట్ తపాలా శాఖ బుకింగ్ కౌంటర్ సక్సెస్ అయిందని పేర్కొన్నారు. చాలా మంది స్పీడ్ పోస్ట్ లను, రిజిష్టర్ పోస్ట్ లను ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అలాగే ఈ ఆధార్ కేంద్రంను కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 9.00 గం఼ఎల నుండి సా: 5.00 గం-ల సేవలను ఉపయోగించు కోవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమం లో అధికారులు పాల్గొన్నారు.

# ఆగిరిపల్లి మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహణ



ఆగిరిపల్లి, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

పాఠశాల విద్యా కమిషనర్ వారి ఆదేశానుసారం వారధి ఇండియా ఫౌండేషన్ 2025 వారు వ్యాసరచన మరియు డిబేటింగ్ పోటీలు ఆగిరిపల్లి మండల స్థాయిలో నిర్వహించారు, ఎదర హై స్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయుని సంధి పాము శారద సహకారంతో నిర్వహించడం జరిగింది, ఈ పోటీలకు 8 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మండలంలో ఆరు పాఠశాలల నుండి పాల్గొనుట జరిగినది, ఈ పోటీలలో వ్యాసరచన పోటీకి గాను మొదటి స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈదులగూడెం విద్యార్థులైన వి, కీర్త. పి, గగన. సిరి. పదవ తరగతి విద్యార్థులు మొదటి స్థానంలో నిలువుగా రెండవ స్థానంలో జడ్పీహెచ్ఎస్ ఎం సురవరం విద్యార్థులు ఎం శివరాజ్యలక్ష్మి ఎస్ కె తస్లిన్ కౌశల్. కే రూపా దేవి. రెండవ స్థానంలో నిలిచారు డిబేటింగ్ పోటీలలో మొదటి స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎం సురవరం విద్యార్థులు జి నమ్రతారోస్, జి రమ్య, ఎం రాజేశ్వరి, విద్యార్థులు నిలిచారు కాగా రెండవ స్థానంలో హై స్కూల్ ప్లస్ ఈదర విద్యార్థులైన ఎస్ శ్రీ సంధ్య, పి కీర్తన, జి అమూల్య జీవన్ అను, విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచినారు. ఈ కార్యక్రమం మొత్తం ఆగిరిపల్లి మండల ఎంఈఓ ఎంఈఓల పర్యవేక్షణలో జరిగినది.ప్రథమ స్థానంలో నిలిచినటువంటి విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లోను, పాల్గొంటారు, అలాగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు ఉంటాయని తెలియజేశారు.

# రైతు సంఘం నాయకులు ఫిర్యాదు



మైలవరం, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

రైతు సంఘం నాయకులను, సిపిఎం పార్టీ గురించి అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రైతు సంఘం నాయకులు మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ కు ఫిర్యాదు చేశారు. మంగళవారం మైలవరంలో ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం సమావేశం స్థానిక ప్రజా సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను, సకాలంలో యూరియాను రైతులుకు, అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీకి చెందిన జి కొండూరు మండలం కవులూరు పిఎసిఎస్ అధ్యక్షుడు చెరుకూరి గంగాధర్ పేరుతో కమ్యూనిస్టు పార్టీలు అవినీతి పార్టీలని, సిపిఎం నాయకులు పనీపాటా లేని నిరుద్యోగులని, అవినీతికి చిరునామాగా మారిన ఎర్ర పార్టీ నేతలు అనే వ్యాఖ్యలతో సోషల్ మీడియా గ్రూపుల్లో మల్లి వసంత పేరుతో పోస్టులు ఫార్వర్డ్ చేశారు.. సిపిఎం పార్టీపై అసత్య ఆరోపణలను జిల్లా కమిటీ ఖండించింది. దీనికి స్పందించిన రైతు సంఘం నాయకులు కౌలూరు పిఎసిఎస్ అధ్యక్షుడు చెరుకూరు గంగాధర్, మల్లి వసంత అనువార్లపై చర్యలు తీసుకోవాలని బుధవారం రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవెంకటరెడ్డి, పివి ఆంజనేయులు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్ది రెడ్డి మాధవరెడ్డిలు సీఐ దాడి చంద్రశేఖర్ కు ఫిర్యాదు చేశారు. స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఖండించకపోవడం విడ్డూరంగా ఉందనాన్నరు.ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన సిపిఎం పార్టీని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం ఎమ్మెల్యే వసంతకు తెలియకుండా జరుగుతుందా అని, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా దొరకక రైతుల ఇబ్బందులును ప్రతిరోజు పత్రికల్లో కథనాలు వస్తుంటే కూటమి నాయకులు కళ్ళుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిపిఎం పార్టీపై చేసిన విమర్శలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మైలవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రావుల సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు రావూరి రమేష్ బాబు, సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, చిలుకూరు సుబ్బారెడ్డి, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను క్రీడల్లో నెం.1గా నిలబెట్టాలి

- స్వర్ణాంధ్ర స్పోర్ట్స్ విజన్ స్ఫూర్తిగా ముందడుగు వేద్దాం
- వనరులను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




విజయవాడ, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదం చేస్తాయని.. సాంస్కృతిక, సామాజిక అంతరాలను తొలగించేందుకు ఉపయోగపడతాయని, రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర స్పోర్ట్స్ విజన్‌కు అనుగుణంగా సమష్టి కృషితో ఎన్‌టీఆర్ జిల్లాను క్రీడల్లో నెం.1గా నిలబెడదామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటుచేసిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన క్రీడాకారులు పతకాలు సాధించేందేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, క్రీడా విధానం విశిష్టతను ఔత్సాహికులకు వివరించేందుకు ఇగ్నైట్ సెల్‌లో అందుబాటులో ఉంచిన ప్రచార సామగ్రితోపాటు వాటర్ స్పోర్ట్స్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ తదితర క్రీడలకు సంబంధించిన సామగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్రంలో శక్తివంతమైన క్రీడా ఆవరణ వ్యవస్థను సృష్టించేందుకు, ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోం దన్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో, అత్యాధునిక శిక్షణతో క్రీడా రాజధా నిగా తీర్చిదిద్దేందుకు, క్రీడా నైపుణ్యం, కొత్త ఆవిష్కరణల్లో ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపుతోందన్నారు. ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా క్రీడలు, ఖేలో ఇండియా వంటి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించే మన క్రీడాకారులకు భారీ నజరానాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వనరులను సద్వినియోగం చేసుకొని క్రీడాకారులు జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కోచ్‌లు కూడా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, వివిధ క్రీడల కోచ్‌లు పి.రవికుమార్, కె.భాస్కర్, కె.జగదీష్, ఎస్.సంతోష్ కుమార్, ఎస్‌కే రియాజ్, ఎస్‌కే ముంతాజ్ బేగం, కె.స్వామి, కె.చిరంజీవి, నాగేశ్వరరావు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ ప్రగతి సూచికలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

- నాలుగు అంశాల్లో ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ
- ఉద్యాన పంటల గ్రామాల వారీ లక్ష్యాల సాధనకు కృషిచేయాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా వివిధ విభాగాల కీలక ప్రగతి సూచికల (కేపీఐ) పురోగతిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని.. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నాలుగు సూచికలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది, ఉద్యాన శాఖ అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పని దినాల కల్పన, సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించడానికి సంబంధించిన అంశాల్లో నిర్దేశించిన నెలవారీ, త్రైమాసిక, వార్షిక లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు సమష్టిగా కృషిచేయాలన్నారు. సగటు వేతనం రూ. 307 ఉపాధి హామీ శ్రామికులకు అందేలా ప్రణాళిక ప్రకారం కృషిచేయాలన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పురోగతికి మార్గంవేసే ఉద్యాన పంటలు దిశగా రైతులను ప్రోత్సహించాలని.. ప్రతి గ్రామానికి ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు చేపట్టేందుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ ఏడాదికి జిల్లా మొత్తంమీద నాలుగు వేల ఎకరాలను, ప్రతి గ్రామ పంచాయతీకి కనీసం 20 ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటివరకు 3,741 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా మునగ సాగుకు 894 ఎకరాలను గుర్తించినట్లు వివరించారు. ఉపాధి హామీ పథకంతో ఉచితంగా ఉద్యాన పంటల సాగును చేపట్టవచ్చని.. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. పంటల సాగు చేపట్టిన మొదటి ఏడాదిలో కూడా ఆదాయం వచ్చేలా పప్పులు, కూరగాయల సాగును అంతర పంటలుగా సాగుచేసేలా సహాయసహకారాలు అందించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మండలాల వారీగా లేబర్ మొబిలైజేషన్, సీసీ రహదారుల నిర్మాణం, పశువుల షెడ్లు, జీవాల షెడ్ల నిర్మాణం, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం తదితరాలపైనా సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము పాల్గొన్నారు.




# అపత్కాలంలో ఉన్న పేదలకు మెరుగైన వైద్యం అందించిన కూటమి ప్రభుత్వం

ఆగిరిపల్లి, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

తమ సమస్య విన్న గంటల్లోనే ఆర్థిక సాయం అందేలా మంత్రి కొలుసు పార్థసారథి సాయం చేశారు. నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడు గ్రామానికి చెందిన పసుపులేటి నాగమణి విజయవాడ స్వర హాస్పిటల్ లో అత్యవసర సర్జరీ మెరుగైన చికిత్స కోసం వారి కుటుంబానికి 1.5లక్షల రూపాయిల సీఎం రిలీఫ్ ఫండ్ ల్ ఓ సి చెక్కును రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు నూజివీడు క్యాంప్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు నియోజకవర్గ జనసేన నాయకులు పాశం నాగబాబు, నీట్ల ఉమామహేశ్వరి, దరివేజుల రాము, మరియు కూటమి నాయకులు అందజేశారు.

# ఎల్ హెచ్ ఆర్ విద్యార్థుల విజ్ఞాన యాత్ర



మైలవరం, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

విహార యాత్ర తో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ప్రిన్సిపాల్ ఇళ్ళ రవి అన్నారు. లకిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిఏ విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటన ను ప్రిన్సిపాల్ రవి ప్రారంభించారు. విజయవాడ లోని బాపూ మ్యూజియం లో ఉన్న ప్రాచీన, మధ్య మరియు నవీన రాతి యుగాలలో వాడిన పురాతన వస్తువులు మరియు వివిధ రకాలుగా తయారు చేసిన విగ్రహాలు భారతీయ సాంస్కృతిక వైభవం నకు నిదర్శనం గా ఉన్నాయని ప్రతి యొక్క అంశాలను చరిత్ర అధ్యాపకులు డి. శ్రీనివాస రావు భారతీయ పురావస్తు శాఖ మ్యూజియం యొక్క ప్రాముఖ్యత ను విద్యార్థుల కు తెలియజేశారు.

# సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం

- తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలి
- డ్రెయిన్లలో డీ సిల్టేషన్‌కు స్పెషల్ డ్రైవ్ చేపట్టండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్‌ఫైల్):

జిల్లాలో ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని.. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. డెంగీ, మలేరియా, డయేరియా కేసులు నమోదుకాకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కృషిచేయాలన్నారు. ఎక్కడైనా వ్యాధి కేసు నమోదైతే పరిసర ప్రాంతాలలో ఇంటింటి సర్వే నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. క్రమంతప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఎక్కడా వర్షపునీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. యాంటీ లార్వాల్ ఆపరేషన్స్‌ను విస్తృత స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. అవసరం మేరకు మెడికల్ క్యాంప్స్ కూడా నిర్వహించాలని స్పష్టం చేశారు. దోమల నియంత్రణతో పాటు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు, డిజిటల్ కంటెంట్, వీడియో షార్ట్ క్లిప్పింగ్స్ వంటివాటితో అవగాహన కల్పించాలని ఆదేశించారు. తాగునీటి వాటర్ సోర్స్‌లతో పాటు ఫిల్టర్ పాయింట్లను నిరంతరం తనిఖీ చేయాలని.. ఎక్కడా కలుషితమయ్యే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. తాగునీటికి క్రమంతప్పకుండా పరీక్షలు నిర్వహించి, నివేదికల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. నిలిచిన నీటి నమూనాలకు కూడా బ్యాక్టీరియలాజికల్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు చేపట్టాలని.. ఓవర్‌హెడ్ రిజర్వాయర్ల క్లీనింగ్, క్లోరినైజేషన్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా, సచివాలయ సిబ్బందితో అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రెయిన్లలో డీ సిల్టేషన్‌కు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. వీసీలో డీపీవో పి.లావణ్య కుమారి, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ హింసలో చిక్కుకున్న భారత్ వాలీబాల్ క్రీడాకారిణి



ఖాట్మండు, సెప్టెంబరు 11: నేపాల్‌లో జెన్‌జడ్ నిరసనలు హింసకు దారితీశాయి. పొఖారా ప్రాంతంలోని ఓ హోటల్‌పై కూడా నిరసనకారులు దాడి చేశారు. దాంతో ఆ హోటల్‌లో బస చేస్తున్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ సాయం కోసం అర్థించారు. భారత ప్రభుత్వం తనకు సాయం చేయాలని ఓ వీడియోలో మొరపెట్టుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'నా పేరు ఉపాసన గిల్. వాలీబాల్ లీగ్ కోసం నేపాల్‌కు వచ్చాను. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెంట పడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవు. రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తు న్నాయి. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగల బెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు చాలామంది సాయం కోసం ఎదురుచూస్తున్నారు' అని గిల్ ఆ వీడియోలో ఆవేదనచెందారు. ఇప్పటికే నేపాల్‌లో ఉన్న భారతీ యులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. కాగా నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు.

# డెంగ్యూ కేసులు 76% పెరిగే ముప్పు




## ఎన్.పినాస్ అధ్యయన వేదిక వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని తాజా అధ్యయనం హెచ్చరించింది. వాతావరణ మార్పుల కారణంగా 2050 నాటికి ఆసియా, అమెరికా ఖండాల్లోని అనేక దేశాల్లో డెంగీ కేసుల సంఖ్య ఏకంగా 76 శాతం వరకు పెరిగే ప్రమాదం ఉందని అమెరికా శాస్త్రవేత్తలు తేల్చారు. వాతావరణ మార్పులకూ, డెంగీ వ్యాప్తికీ మధ్య ఉన్న ప్రత్యక్ష సంబంధాన్ని ఈ అధ్యయనం స్పష్టంగా చెప్పింది. వాషింగ్టన్, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలతో పాటు అమెరికా జాతీయ ఆర్థిక పరిశోధన బ్యూరోకు చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేపట్టారు. వారి విశ్లేషణ ప్రకారం, ఇది కేవలం భవిష్యత్తు ముప్పు మాత్రమే కాదు. ఇప్పటికే 1995 నుంచి 2014 మధ్యకాలంలో నమోదైన డెంగీ కేసుల్లో 18 శాతం పెరుగుదలకు వాతావరణ మార్పులే కారణమని తేలింది. దీనివల్ల ఏటా సగటున 46 లక్షల మంది అదనంగా డెంగీ బారిన పడుతున్నారని అంచనా వేశారు. డెంగీ వైరస్‌ను వ్యాపింపజేసే దోమలు వృద్ధి చెందడానికి, వ్యాధి వ్యాప్తికి సుమారు 27.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అత్యంత అనుకూలంగా ఉంటుందని పరిశోధకులు గుర్తించారు. ప్రస్తుతం చల్లగా ఉన్న ప్రాంతాలు వేడెక్కుతున్న కొద్దీ అక్కడ డెంగీ వ్యాప్తి ఒక్కసారిగా పెరిగే ప్రమాదం ఉంది. మెక్సికో, పెరూ, బ్రెజిల్ వంటి దేశాల్లోని అధిక జనాభా కలిగిన చల్లని ప్రాంతాల్లో కేసుల సంఖ్య భారీగా పెరగవచ్చని అంచనా వేశారు. ఉష్ణోగ్రత ప్రభావం మేం ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా ఉంది. ఉష్ణోగ్రతలో చిన్న మార్పు కూడా డెంగీ వ్యాప్తిపై పెద్ద ప్రభావాన్ని చూపుతుంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని మనం ఇప్పటికే చూస్తున్నామని శాస్త్రవేత్తల బృందానికి నేతృత్వం వహించిన వాషింగ్టన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మరిస్సా చైల్డ్స్ తెలిపారు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల స్థాయిని బట్టి 2050 నాటికి డెంగీ కేసులు 49 నుంచి 76 శాతం వరకు పెరగవచ్చని ఈ అధ్యయనం హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో కేసుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం కూడా ఉందని, దీనివల్ల దాదాపు 26 కోట్ల మంది ప్రజలు ప్రమాదంలో పడతారని పేర్కొంది. వాతావరణ మార్పులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడం, దోమల నియంత్రణ, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, కొత్త డెంగీ వ్యాక్సిన్లను అందుబాటులోకి తేవడం వంటి చర్యల ద్వారా ఈ ముప్పును తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ అధ్యయన వివరాలు ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



## విశ్రాంతి లేకుండా ఎన్నికల కోసం పనిచేయాలి

### పార్టీ కేడర్‌తో సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 11: అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేవరకూ 'విశ్రాంతి' అనే మాట మరిచి, పార్టీ కోసం ముమ్మరంగా ప్రచారం చేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని జిల్లా కార్యదర్శులకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ పదేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పాతాళానికి చేరుకున్న ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం విజయం సాధించిందని, గడిచిన నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి 11.19 శాతానికి పెరిగిందని, రాష్ట్రాన్ని పారిశ్రామికపరంగా అభివృద్ధి చేసే దిశగా ఇటీవల తాను జరిపిన జర్మనీ, ఇంగ్లండ్ దేశాల పర్యటలో భారీగా పారిశ్రామిక పెట్టుబడులను సమీకరించానని చెప్పారు. విదేశీ పర్యటనలో రూ.15,516 కోట్ల పెట్టుబడులు సమీకరించడంతో పర్యటన 'సూపర్ హిట్' అయ్యిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ట్రిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలంటే పెట్టుబడుల సమీకరణ, విదేశీ పర్యటనలు చాలవని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగానే జూలై 3న 'ఏకతాటిపై తమిళనాడు' అనే ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ జిల్లా కార్యదర్శులు, నగర, పట్టణ శాఖ కార్యదర్శులే కాకుండా పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీ ఇన్‌ఛార్జులు 'విశ్రాంతి' అనే మాటే మరచిపోవాలని, నిద్రాహారాలు కూడా పట్టించుకోకుండా పార్టీ అభ్యర్థులు, కూటమి అభ్యర్థుల విజయం కోసం తీవ్రంగా శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 15న అన్నాదురై జయంతి సందర్భంగా 68 వేల పోలింగ్ కేంద్రాల ఇన్‌ఛార్జులు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడతామని శపథం చేయాలన్నారు. అన్నాదురై జయంతి వేడుకలు తర్వాత సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

# మీడియా మీట్‌లోనే కుప్పకూలిన ఆరోగ్యమంత్రి

స్టాక్‌హోమ్, సెప్టెంబరు 11: స్వీడన్ కొత్త ఆరోగ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎలిసబెత్ లాన్ ఆ పదవిలో చేరిన కొద్ది గంటల్లోనే అనారోగ్యానికి గురయ్యారు. ముఖ్యంగా మీడియా సమావేశంలో స్టేజ్ మీదే కుప్పకూలిపోయారు. 48 ఏళ్ల వయస్సు కల్గిన ఆమె స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్, క్రిస్టియన్ డెమోక్రాట్స్ పార్టీ నాయకురాలు ఎబ్బా బుష్‌తో కలిసి పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ముఖ్యంగా ఆ వీడియోల్లో లాన్ ఒక అధికారి మాట్లాడుతున్న మాటలను శ్రద్ధగా వింటూ ఒక్కసారిగా ముందుకు పడిపోయారు. తన ముందుకు మైక్ స్టాండ్ ఉండగా దాని మీద నుంచే కింద పడ్డారు. ఈ విషయం గుర్తించిన ఎబ్బా బుష్ వెంటనే లాన్ వద్దకు పరుగెత్తి ఆమెను వెనక్కి తిప్పడానికి సహాయం చేశారు. ఆలోపే ఇతర అధికారులు, పాత్రికేయులు ఆమె చుట్టూ చేరి సహాయం అందించడానికి ప్రయత్నించారు. కానీ అప్పటికే లాన్ స్పృహ కోల్పోయి ఉండగా వెంటనే సిబ్బంది అమె ముఖంపై నీళ్లు చల్లారు. ఆ తర్వాత కాసేపటికే ఆమెకు స్పృహ రాగా తనకేమీ కాలేదని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా ఘటన జరిగిన కాసేపటికే ఎలిసబెత్ లాన్ తిరిగి మీడియా సమావేశానికి వచ్చారు. తనకేమీ కాలేదని, రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గినప్పుడు తనకిలా అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే కళ్లు తిరిగి పడిపోవడం వల్ల తనకు ఎలాంటి గాయాలు కూడా కాలేదని ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాని స్పష్టం చేశారు. ప్రశ్నలుసమాధానాల సెషన్‌ను కూడా రద్దు చేశారు. మాజీ మంత్రి అక్కో అంకర్‌బెర్గ్ జోహాన్సన్ రాజీనామా చేయగా లాన్ ఆరోగ్య మంత్రిగా నియమితులు అయ్యారు. జోహాన్సన్ మూడు సంవత్సరాలు ఈ పదవిలో పనిచేశారు. 1986లో స్వీడిష్ క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీతో తన వృత్తిని ప్రారంభించారు. ఎలిసబెత్ లాన్ క్రిస్టియన్ డెమోక్రాట్స్ పార్టీలో చాలా కాలం నుంచి సభ్యురాలిగా ఉన్నారు. ఆమె ఇంతకు ముందు 2019 నుంచి గోటెన్‌బర్గ్‌లో మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు. అలాగే ఆమె శాంతి, అభివృద్ధి అధ్యయనాలు, రాజకీయ శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చేశారు. అంతేకాకుండా ఆమె



క్యాబినెట్ ఆఫీస్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా కూడా పని చేసి..ఆరోగ్య సంరక్షణ బాధ్యత విచారణలో పాల్గొన్నారు. ఈ సంఘటనలు ప్రజారోగ్య సంరక్షణపై, అలాగే ప్రజా నాయకుల ఒత్తిడితో కూడిన పని వాతావరణంపై చర్చకు దారితీస్తున్నాయి.

ఇలాంటి ఘటనలు జరగకుండా నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు, విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజా నాయకులకు పని ఒత్తిడి తగ్గించడానికి, వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రభుత్వాలు మరింత శ్రద్ధ వహించాలని అంటున్నారు.

# భారత్, చైనాలపై 100% సుంకాలు వేయండి

## ఇయూ దేశాలపై ట్రంప్ ఒత్తిడి



వాషింగ్టన్, సెప్టెంబరు 11: భారత్,చైనాలపై నూరుశాతంసుంకాలు విధించాలని అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ యూరోపియన్ కూటమి దేశాలను డిమాండ్‌చేస్తున్నారు. దీనివల్ల రష్యా ఉక్రెన్‌పై చేస్తున్న యుద్ధాన్ని నివారించగలుగుతామని చెపుతున్నారు. ఈ రెండుదేశాల దిగుమతులపై 100శాతం సుంకాలు వేయాలని ఈయూను కోరారు. రష్యాపై ఆంక్షలు విధించే అంశానికి సంబంధించి సీనియర్ అమెరికన్ ఈయూ అధికారులు వాషింగ్టన్‌లో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఈయూ అధికారులతో ట్రంప్ కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడి రష్యాపై ఆర్థిక ఒత్తిడి తెచ్చేందుకు భారత్, రష్యాలపై 100శాతం సుంకాలు వేయాలని కోరారు. చమురు కొనుగోలు చేయడం నిలిపివేస్తామనేవరకూ ఈ ట్యారిఫ్‌లను కొనసాగించాలన్నారు. మేం ఇలాచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ యూరోపియన్ భాగస్వాములతోకలిసి ముందుకు వస్తేనే దీన్ని అమలుచేయగలుగుతామని యుఎస్ అధికారి ఒకరు అన్నారు. అమెరికా సూచనలు అమలుచేసేందుకు తాము సిద్ధమేనని ఈయూ అధికారులు చెప్పినట్లు అమెరికా అధికారులు ప్రస్తావిస్తున్నారు. ఉక్రెయిన్‌లో సత్వరమే శాంతిని నెలకొల్పాలనిఈయూ కూడా భావిస్తోందని, ఈక్రమంలో రష్యాపై ఒత్తిడి అనివార్యమని ట్రంప్ అన్నారు. అయితే భారత్ చైనాలపై ఆంక్షలు విధిస్తే ఎదురయ్యే పరిణామాలపై వారు చర్చలుజరుపుతూన్నరు.రష్యానుంచి చమురు కొనుగోలుచేస్తుండటంపై భారత్,చైనాలపై ట్రంప్ కొన్నిరోజులుగా గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌పై 50శాతం సుంకాలు విధించారు.ఎస్సీఓ సదస్సుకు భారత ప్రధానిమోడీచైనాలోపర్యటించిన సందర్భంగా చైనా, రష్యా, భారత్ అగ్రనేతల ముచ్చట్లు ట్రంప్‌తో పాటు అమెరికన్లను కూడా కలవరపరిచాయి. భారత్‌తో నెలకొన్న వాణిజ్య అడ్డంకులు తొలగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలో పోస్టుపెట్టారు. ప్రధానిమోడీతో చర్చించేందుకు తాను ఎదురుచూస్తున్నానని ఆ పోస్టులో పేర్కొన్నారు.

# ఫ్రాన్స్‌లో వెల్లువెత్తిన నిరసనలు

## బడ్జెట్ ప్రతిపాదనలపై ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహం




ప్యారిస్,సెప్టెంబరు 11: రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఫ్రాన్స్‌లో తాజాగా భారీ ఎత్తున నిరసనలు చెలరేగాయి. ఫ్రాన్స్ ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలను వ్యతిరేకంగా వేలాది మంది నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. బ్లాక్ ఎవ్రీథింగ్ పేరుతో పెద్ద ఎత్తున వీధుల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆర్థిక, రాజకీయ సంక్షోభం, సమాజంలో నెలకొన్న అశాంతి కారణంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది స్థానికులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. పారిస్ సహా ప్రధాన నగరాల్లో నిరసనకారులు రోడ్లను దిగ్బంధించారు. వాహనాలకు నిప్పు పెట్టారు. పశ్చిమ నగరమైన రెన్నెస్‌లో నిరసనకారులు ఓ బస్సును తగలబెట్టారు. రంగంలోకి దిగిన అధికారులు ఆందోళనకారులను అడ్డుకునేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇప్పటి వరకూ దాదాపు 200 మందిని అరెస్ట్ చేసినట్లు అంతర్గత మంత్రి బ్రూనో రిటైల్లూ ప్రకటించారు. అంతేకాదు దేశ వ్యాప్తంగా భద్రతా దళాలను మోహరించినట్లు చెప్పారు. శాంతి భద్రతలు కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు ఫ్రాన్స్ నూతన ప్రధానిగా సెబాస్టియన్ లెకోర్నూ నియమితులైన విషయం తెలిసిందే. విశ్వాసపరీక్షలో ప్రధాని బేరో ఓటమిపాలవటంతో రక్షణమంత్రిని కొత్త ప్రధానిగా ఎంపికచేశారు. ఏడాది వ్యవధిలో ఫ్రాన్స్‌లో ప్రధానిగా బాధ్యత చేపట్టిన నాలుగో వ్యక్తిగా లెకోర్నూ నిలిచారు. అంతకుముందు బేరో ప్రతిపాదించిన విశ్వాస పరీక్షలో ఆయనకు వ్యతిరేకంగా 364 ఓట్లు, అనుకూలంగా 194 ఓట్లు వచ్చాయి.

# సహస్ర సీమాదళ్ భద్రతలో నేపాల్ సరిహద్దులు

డెహ్రాడూన్, సెప్టెంబరు 11: నేపాల్‌లో చెలరేగుతున్న జన్‌జడ్ నిరసనలను నిశితంగా పరిశీలిస్తున్న భారత్ అప్రమత్తమైంది నేపాల్‌లోని అశాంతిని ఆసరాగా చేసుకుని సంఘ విద్రోహ శక్తులు భారత భూభాగంలోకి ప్రవేశించి, సరిహద్దు రాష్ట్రాల్లో హింసను ప్రేరేపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. నేపాల్ సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల పోలీసులతో పాటు సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) బలగాలను అప్రమత్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి జిల్లాలోని గౌరిఫంటా సరిహద్దు వద్ద భద్రతా దళాలు పోలీసు పోర్టును ఏర్పాటు చేశారు. నేపాలీ పౌరులను భారత భూభాగంలోకి అనుమ తించడం లేదు. అయితే, పొరుగు దేశంలోని భారతీయుల్ని మాత్రం స్వదేశంలోకి అనుమతిస్తున్నారు. అదేవిధంగా నేపాల్ కూడా భారతీయుల్ని తమ భూభాగంలోకి అనుమతించడం లేదు. సరిహద్దు జిల్లాల్లో మార్కెట్లు మూగబోయాయి.

# సంక్షిప్తంగా..

## సంవత్సరంలో 15 రోజులు మాత్రమే పనిచేసే రైల్వేస్టేషన్



పాట్నా, సెప్టెంబర్ 11: భారత్‌లో దాదాపు 7,500 రైల్వే స్టేషన్లు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో అనుగ్రహ నారాయణ్‌రోడ్ ఘాట్ స్టేషన్ మాత్రం చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఇది సంవత్సరంలో 15 రోజులే పని చేస్తుంది. అది కూడా పితృపక్షంలో ప్రజలు తమ పితృదేవతలను పూజించుకోవడానికి కావడం విశేషం. ఈ ఏడాది పితృపక్షం సెప్టెంబర్7న మొదలైంది. దీంతో అనుగ్రహ నారాయణ్‌రోడ్ ఘాట్‌స్టేషన్ సమీపంలోని పున్‌పున్ నదీ తీరంలో రెండు వారాలపాటు పిండ ప్రదానాలు జరగనున్నాయి. పున్‌పున్ నదికి ఆదిగంగ పున్‌పున్ అనే పేరు కూడా ఉంది. ఇది గంగా నది కంటే ప్రాచీనమైందని భావిస్తారు. ఈ 15 రోజులు ఈ ప్రాంతానికి దేశంలోని ప్రజలే కాకుండా విదేశాల నుంచి కూడా తరలివస్తారు. అందుకే ఇక్కడ ఈ నెల 21 వరకు రైళ్లు ఆగుతాయని అధికారులు తెలిపారు.

## పోలెండ్ ఎయిర్‌స్పేస్‌లోకి రష్యా డ్రోన్లు

వార్సా,సెప్టెంబరు 11: తమ వైమానిక క్షేత్రంలోకి ఎంటర్ అయిన రష్యా డ్రోన్లను కూల్చివేసినట్లు పోలాండ్ ప్రకటించింది. మంగళవారం రాత్రి సుమారు 19 రష్యా డ్రోన్లు పోలాండ్ ఎయిర్‌స్పేస్‌లోకి ప్రవేశించాయి. అయితే దాంట్లో నాలుగు డ్రోన్లను పోలాండ్ కూల్చినట్లు స్పష్టం అవుతున్నది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మళ్లీ యుద్ధం చేసేందుకు పోలాండ్‌ను ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందని ఆ దేశ ప్రధాని డోనాల్డ్ టస్క్ తెలిపారు. పోలాండ్, నాటోకు చెందిన విమానం ద్వారా ఆ డ్రోన్లను కూల్చివేశారు. ఓ నాటో దేశం వైమానిక క్షేత్రంలో రష్యా డ్రోన్లను కూల్చడం ఇదే తొలిసారి. ఏడు డ్రోన్ల శకలాలు, గుర్తు తెలియని వస్తువులను పసికట్టామని పోలాండ్ హోంశాఖ మంత్రి వెల్లడించారు. అయితే నాటో దేశంలోకి కావాలనే డ్రోన్లను ఎంటర్ చేయించారేమో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పోలాండ్ ఎయిర్‌స్పేస్‌లోకి డ్రోన్లు వెళ్లినట్లు వచ్చిన వార్తలను రష్యా దౌత్యవేత్త ఖండించారు. పోలాండ్‌లోని వార్సాకు రావాల్సిన విమానాలను ఆలస్యం చేశారు.

## ఆప్ ఎమ్మెల్యే అరెస్టుపై వెల్లువెత్తిన నిరసన



శ్రీనగర్, సెప్టెంబరు 11: దోడాకు చెందిన ఏకైక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్ ఆ జిల్లా మేజిస్ట్రేట్ హర్విందర్ సింగ్ మధ్య వివాదం తలెత్తింది. గ్రామస్తుడికి అద్దె చెల్లించని ఆ ఎమ్మెల్యే ప్రజా దుర్వినియోగానికి పాల్పడ్డారని, అన్‌పార్లమెంటరీ భాష ఉపయోగించారని మేజిస్ట్రేట్ ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌పై కఠినమైన ప్రజా భద్రతా చట్టం (పీఎస్ఏ) కింద కేసు నమోదుకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ఈ చట్టం కింద విచారణ లేదా ప్రాసిక్యూషన్ లేకుండా ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రెండేళ్లపాటు జైలులో ఉంచవచ్చు. కాగా, ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్ అరెస్ట్‌పై దోడా జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆయనను విడుదల చేయాలంటూ ప్రజలు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. జనాన్ని చెదరగొట్టేందుకు లాఠీ ఛార్జ్ చేశారు. ఈ ఘర్షణల్లో ఒక పోలీసు అధికారితో సహా పలువురు గాయపడ్డారు. నిరసనలు మరిన్ని ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో దోడా జిల్లాలో కర్ఫ్యూ వంటి ఆంక్షలు విధించారు.

## సుప్రీంను ఆశ్రయించిన ఉమర్ ఖలీద్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: దేశ రాజధాని ఢిల్లీ లో 2020లో చోటుచేసుకున్న అల్లర్ల కేసు లో నిందితుడిగా ఉన్న ఉమర్ ఖలీద్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఢిల్లీ హైకోర్టు తనకు బెయిల్ నిరాకరించడాన్ని అతను సుప్రీంకోర్టు లో ఛాలెంజ్ చేశాడు. ఢిల్లీ హైకోర్టు ఈ నెల 2న ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ సహా 9 మంది బెయిల్ పిటిషన్‌లను తోసిపుచ్చింది. బెయిల్ పిటిషన్‌లు తిరస్కరణకు గురైన వారిలో ఖలీద్, షర్జీల్‌తోపాటు మహ్మద్ సలీమ్ ఖాన్, షిఫా ఉర్ రెహ్మాన్, అథర్ ఖాన్, మీరన్ హైదర్, అబ్దుల్ ఖాలిద్ సైఫీ, గుల్ఫిషా ఫాతిమా, షాదాబ్ అహ్మద్ ఉన్నారు. వారిలో షర్జీల్ ఇమామ్, ఫాతిమా గత వారమే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇప్పుడు ఉమర్ ఖలీద్ సుప్రీంకు వెళ్లాడు. ఢిల్లీ హైకోర్టు తన బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చడాన్ని సవాల్ చేశాడు. 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో సీఏఏ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఘటనలో దాదాపు 53 మంది దుర్మరణం పాలయ్యారు.

# కెనడాకంటే జర్మనీ వైపు ఫోకస్ పెంచిన భారతీయ విద్యార్థులు

## వీసా నిబంధనలు కఠినతరం కావడమే కారణం

టొరంటో, సెప్టెంబరు 11: దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధమైన అత్యంత నిర్బంధ వీసా విధానాలను కెనడా ప్రస్తుతం అమలు చేస్తోంది. దీంతో 2025 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు దాదాపు 80 శాతం మంది భారతీయ విద్యార్థుల దరఖాస్తులను తిరస్కరించింది. కెనడా తిరస్కరణలతో ప్రధానంగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాల విద్యార్థులపై ప్రభావం పడింది. దీంతో వారు ఇతర దేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలు, కాలేజీల్లో చేరడం మొదలుపెట్టారు. అక్కడ విదేశీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వ్యక్తిగత భద్రత లభిస్తుంది. 2023 నుంచి కెనడా ప్రభుత్వం కఠినమైన స్టూడెంట్ వీసా నిబంధనలు, అడ్మిషన్ విధి విధానాలను అమల్లోకి తెచ్చింది. అయినప్పటికీ ఏటా ఎంతోమంది భారతీయ విద్యార్థులు కెనడా వీసాల కోసం అప్లై చేస్తున్నారు. అక్కడి యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందాలనే లక్ష్యంతో భాషా పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ఇందుకోసం వివిధ ప్రిపరేషన్ కోర్సులు చేస్తున్నారు. ఈక్రమంలో ఎంతో డబ్బును ఖర్చు చేస్తున్నారు. అయినా కెనడా విద్యాసంస్థల్లో ప్రవేశాలు రాకపోవడంతో ఎంతోమంది భారతీయ విద్యార్థులు ఇతర దేశాల విద్యాసంస్థలను అన్వేషిస్తున్నారు. కెనడా యూనివర్సిటీల్లో చేరాలని భావించే విదేశీ విద్యార్థులు చూపించాల్సిన బ్యాంకు బ్యాలెన్స్ మొత్తాన్ని పెంచారు. ఇప్పుడు భారతీయ విద్యార్థులు ఇందుకోసం ఏకంగా రూ.12.73 లక్షలు చూపించాల్సి వస్తోంది. కఠినమైన భాషా పరీక్షలను సైతం రాయాల్సి వస్తోంది. భారతీయ విద్యార్థులు చదువుకుంటూ, పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకునే మార్గాలపైనా పరిమితులను విధించారు. భారత్, చైనా వంటి దేశాల విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే 'స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్' వ్యవస్థను సైతం కెనడా మూసివేసింది. 2024లో ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థులు ఆసక్తి చూపిన గమ్యస్థానంగా జర్మనీనిలుస్తోంది. భారతీయ విద్యార్థుల్లో 31శాతం మంది జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. కెనడాలో చదవాలని కోరుకునే మనదేశ స్టూడెంట్స్ సంఖ్య రెండేళ్ల వ్యవధిలో 18 శాతం నుంచి 9 శాతానికి తగ్గిపోయింది విదేశీ విద్యార్థుల ట్యూషన్ ఫీజులపైనే ఆధారపడి నడుస్తున్న కెనడాలోని విశ్వవిద్యాలయాలు, కాలేజీల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కొన్నింటిని పెద్ద యూనివర్సిటీల్లో విలీనం చేస్తున్నారు. ఇంకొన్ని మూసివేత ముప్పును ఎదుర్కొంటున్నాయి. అక్కడి ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. జర్మనీ యూనివర్సిటీలు, కాలేజీలకు సరిపడా ప్రభుత్వ నిధులు అందుతున్నాయి. విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను జర్మనీ సర్కారు ప్రోత్సహిస్తోంది. ఆంగ్ల భాష వచ్చిన భారతీయ విద్యార్థులకు సులభంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు.



# 'పిండ ప్రదానం'పైనా బీహార్ ఎన్నికల రాజకీయాలు!

గయా, సెప్టెంబర్ 11: బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ పితృదేవతలకి సమర్పించే పిండ ప్రదానం మీద కూడా రాజకీయాలు నడుస్తున్నాయి. ఇదే అంశాన్ని విమర్శనాస్త్రంగా చేసుకుని బీహార్‌లోని రాష్ట్రీయ జనతా దళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలకు దిగారు. ప్రధాని మోదీ గయాలో తన మాతృమూర్తికి చేయదల్చిన 'పిండ ప్రదానం' కార్యక్రమం మీద లాలూ యాదవ్ విమర్శలు గుప్పించారు. జనతా దళ్‌యునైటెడ్ అధ్యక్షుడు నీతీష్ కుమార్ రాజకీయ జీవితానికి 'పిండ ప్రదానం' చేయడానికి ఉద్దేశించిందంటూ లాలూ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు బీహార్ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. కాగా, ప్రధాని నరేంద్రమోదీ తన పుట్టిన రోజైన సెప్టెంబర్ 17వ తేదీన తల్లి దివంగత మీరాబెన్‌కి గయాలో పిండప్రదానం చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే లాలూ యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో ఒక వీడియో షేర్ చేస్తూ, మోదీపై ఓట్ చోరీ ఆరోపణలు చేశారు. గయాలో మోదీ 13,000 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, రెండు రైళ్లను జెండా ఊపి ప్రారంభించండం ఓట్ చోరీలో భాగమేనని లాలూ యాదవ్ ఆరోపించారు. మోదీ రాష్ట్రంలో ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి పొందేందుకు పలు రకాలుగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తల్లికి గయాలో పిండ ప్రదానం కూడా ఇలాంటిదేనన్నారు.

పిండ ప్రదానం అనే హిందూ సంప్రదాయాన్ని రాజకీయ కోణంలో ఉపయోగించడం ద్వారా మోదీ, బీహార్ లో కొత్త రాజకీయాలు చేస్తున్నారని లాలూ ప్రసాద్ యాదవ్ ఎద్దేవా చేశారు. నితీష్ కుమార్‌ను బీజేపీ, తన నీడలోకి లాగేసుకుందని కూడా లాలూ యాదవ్ అన్నారు.

## అగ్నిప్రమాదాల నియంత్రణపై డెమో ద్వారా అవగాహన



**తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్)** ఒకేషనల్ ఎడ్యుకేషన్ లో భాగంగా అగ్నిమాపక శాఖ అధికారులు బాలికోన్నత పాఠశాలలో, అగ్నిప్రమాదాల సమయంలో, ప్రమాద బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, క్షేత్రస్థాయి ప్రదర్శన ద్వారా వివరించారు.

స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా బాలికోన్నత పాఠశాలలో, గురువారం సాయంత్రం ఒకేషనల్ కోర్స్ లో భాగంగా,జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎస్. వేణుగోపాల్ స్వీయ పర్యవేక్షణలో, విద్యార్థినులకు, విద్యుత్ వల్ల,గ్యాస్ లీక్ వల్ల,ఆయిల్ వల్ల,అగ్ని ప్రమాదాలలో చిక్కుకుంటె, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో, డెమొ ద్వారా వివరించారు. అత్యవసర సమయంలో సిపిఆర్ పైన, అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. రాఘవయ్య, ఒకేషనల్ టీచర్ ఎ. నాగస్పందన, అగ్నిమాపక సిబ్బంది, పాఠశాల విద్యార్థినిలు, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో సిమెంట్ బల్లల ఏర్పాటు



○ **శాసనసభ్యులు, రాష్ట్ర ఐటీ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ సహకారం**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణంలోని 27, 7, వార్డులలో,ఆత్మకూరు గ్రామంలో స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు రెండు సిమెంట్ బల్లలను, మంగళగిరి పట్టణంలోని 27వ వార్డులో 4 సిమెంట్ బల్లలు, పట్టణంలోని 7 వార్డులో 4 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. పట్టణ,గ్రామస్తుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని మంగళగిరి శాసనసభ్యులు,రాష్ట్ర ఐటీ విద్య శాఖల మంత్రి నారా లోకేష్ సహకారంతో ఈ బల్లలు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రజలకు విశ్రాంతి తీసుకునే విధంగా ఉపయోగపడే ఈ సౌకర్యం కల్పించడంతో పట్టణవాసులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ అభ్యర్థనను వెంటనే పరిష్కరించినందుకు మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎప్పుడూ ముందుండే మంత్రి నారా లోకేష్ సహకారం అభినందనీయమని ప్రజలు అభిప్రాయపడ్డారు.

## స్వామి వివేకానంద దిగ్విజయ్ దివస్



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** 1893 సెప్టెంబర్ 11న చికాగోలో స్వామి వివేకానంద చేసిన చారిత్రాత్మక ప్రసంగం స్ఫూర్తిగా, బిజెపి యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం గుంటూరులో "దిగ్విజయ్ దివస్" నిర్వహించారు. జిల్లా యువమోర్చా అధ్యక్షుడు మైలా హరికృష్ణ ఆధ్వర్యంలో పట్టాభిపురం వివేకానంద సర్కిల్ నుండి విద్యార్థులతో ఒక కిలోమీటర్ నడక జరిగింది. సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ "ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక జ్యోతి వెలిగితేనే సమాజం సజ్జనతరం అవుతుంది. వ్యక్తుల సౌశీల్యంపై దేశ సౌశీల్యం ఆధారపడి ఉంటుంది. నిరంతర అభ్యాసమే పరిపూర్ణతకు దారితీస్తుంది" అని విద్యార్థులకు సూచించారు.

అలాగే "1893లో చికాగో విశ్వవేదికపై స్వామి వివేకానంద హిందూ ధర్మ మహోన్నతతను చాటి చెప్పారు. ఆయన అడుగుజాడల్లో యువత నడవాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ యశ్వంత్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎక్కల సాయి, జిల్లా కార్యదర్శులు రాజా, ఈశ్వర్ గౌడ్, సాయి రాధాకృష్ణ, చంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్, పాలపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాసరావు, దేసు సత్యనారాయణ, వై.వి. సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. విభిన్న కళాశాలల విద్యార్థుల హాజరుతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## కమిషనర్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేత



○ **నోటీస్‌ను అందజేసిన వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ**

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు గుంటూరు నగర వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులును కలిసి ఉద్యమ కార్యాచరణ నోటీసు అందజేశారు.

ఈ సందర్భంగా వారు సమర్పించిన నోటీసులో సచివాలయ ఉద్యోగులను సర్వేల బాధ్యతల నుంచి విముక్తి కల్పించి సంబంధిత మాతృశాఖలకు అప్పగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, బకాయిలు చెల్లించాలని, స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని, బదిలీలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలతో జీవో జారీ చేయాలని, సీనియార్టీ జాబితా వెంటనే ప్రచురించాలని కోరారు.

ఈ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర జేఏసీ ప్రభుత్వం కు 15 రోజుల గడువు ఇచ్చిందని, అదే ఉద్యమ కార్యాచరణలో భాగంగా స్థానిక అధికారులకు కూడా నోటీసులు అందజేస్తున్నామని జేఏసీ నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్, ధనలక్ష్మి, మధులత, సందీప్, అనురాధ, మధు, సతీష్, హరికృష్ణ, నజీర్, సుభాని, మహేష్, శేషగిరి, కొండలరావు, దీప్తి, ప్రశాంతి, వాసు, గురుబ్రహ్మం, ప్రవీణ్, రవి మాధవ్, యుగంధర్, నందిని తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజలను సురక్షితంగా రప్పించిన మంత్రి లోకేష్

○ **ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న తెలుగు ప్రజలను మంత్రి నారా లోకేష్ సురక్షితంగా తీసుకొచ్చారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఇది ప్రజల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నేపాల్‌లో జరిగిన అల్లర్లలో చిక్కుకుపోయిన సుమారు 200 మంది తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడంలో ఐటీ మంత్రి నారా లోకేష్ గారు కీలక పాత్ర పోషించారు. తెలుగువారికి ఎక్కడ ఆపద వచ్చినా ఆదుకోవడంలో మా పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఆయన మరోసారి చాటి చెప్పారు. ఈ విషయం తెలిసిన వెంటనే అనంతపురం పర్యటన రద్దు చేసి అమరావతికి చేరుకుని రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్ వార్‌రూమ్‌ను కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. చిక్కుకుపోయిన వారి లొకేషన్‌లను సేకరించి మ్యాపింగ్ చేయించి ఒక్కరిని కూడా వదిలిపెట్టకుండా రక్షించే వ్యూహాన్ని సిద్ధం చేశారు. ఢిల్లీలోని ఏపీ భవనంలో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా చూశారు. కేంద్రంతో సమన్వయం చేస్తూ ప్రతి ఒక్కరినీ సురక్షితంగా స్వదేశానికి రప్పించారు. గతంలో కూడా మా పార్టీ ఇదే మానవతాదృక్పథం చూపింది. 2024లో విజయవాడలో అత్యధిక వర్షాలు, క్రిష్ణా నది, బుడమేరు వాగు ఉధృతికి నగరం మునిగిపోతున్నప్పుడు చంద్రబాబు ప్రత్యక్షంగా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, 50,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 100కి పైగా రక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి, ఆరోగ్య శిబిరాలు, వైద్యసేవలు అందించారు. వర్షాల వల్ల చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహారం, మందులు, అవసరమైన వస్తువులు పంపించారు. 2014లో హుద్ హుద్ తుపాను సమయంలో విశాఖపట్నం సహా ప్రభావిత జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసి కేంద్రానికి నివేదించి దానిని జాతీయ విపత్తుగా గుర్తింపు పొందేలా కృషి చేశారు. కంబోడియా సైబర్ స్కామ్‌లో చిక్కుకున్న తెలుగు యువకులను రక్షించడానికి నారా లోకేష్ కృషి చేశారు. అనేక ప్రకృతి విపత్తుల్లో తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన ఉంటుందని, ఆపదలో ముందుండి అండగా నిలుస్తుందని రుజువు చేస్తున్నాయి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# వర్షాల వలన సమస్యలు తలెత్తకుండా జిఎంసి ముందస్తు చర్యలు

○ **కమిషనర్ పులి శ్రీనివాసులు**



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో వర్షాల వలన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నల్లపాడు రోడ్ అవుట్‌ఫాల్ డ్రెయిన్, శ్రీరామ్‌నగర్ రోడ్ ఆక్రమణల తొలగింపు, ఎస్వీఎన్ కాలనీ, విద్యానగర్ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు తగు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాలు నిల్వకుండా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా సమస్యలు తలెత్తితే 24 గంటలు అందుబాటులో ఉండే జిఎంసి కాల్ సెంటర్ 08632345103 నంబర్‌కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. త్రాగునీటి సరఫరాకు విద్యుత్ అంతరాయం ఆటంకం కలగకుండా ఏఈల వారీగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్వీఎన్ కాలనీ, నల్లపాడు రోడ్ ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, రోడ్లపై డంపింగ్ పాయింట్లు లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని గురువారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా బ్రహ్మంగారిమఠం మండలంలోని సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కమిటీ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ....

కార్మిక వర్గ పక్షపాతి పీడిత ప్రజల ప్రియతమ నేత సీతారాం ఏచూరి అని ఆయన అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దేశవ్యాప్తంగా అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి అని ఆయన తెలిపారు. మతతత్వం మరియు నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఏచూరి క్రమం తప్పకుండా పార్లమెంటులో జోక్యం చేసుకునే వారిని ఆయన అన్నారు. దేశంలో ఇందిరాగాంధీ సమయంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు జైలుకు కూడా వెళ్లారని ఆయన తెలిపారు . దేశంలో వామపక్ష మేధావుల్లో సీతారాం ఏచూరి ఒకరని ఆయన ఇవాళ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని ఆయన తెలిపారు .ఉత్తమ పార్లమెంటీరియన్ నేత అని, జాతీయస్థాయిలో సుందరయ్య తర్వాత రెండో వ్యక్తి సీతారాం ఏచూరి అని ఆయన తెలిపారు. విద్యార్థుల బోధన రీసెర్చ్ కోసం తన పార్థీవదేహాన్ని కూడా ఎయిమ్స్ మెడికల్ హాస్పిటల్ కు తమ కుటుంబ సభ్యులు అప్పజెప్పారని ఆయన తెలిపారు. తాడిత పీడిత అణగారిన వర్గాల ప్రజల కోసం అనునిత్యం పోరాడిన గొప్ప మహనీయుడు సీతారాం ఏచూరి అని ఆయన అన్నారు ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ప్రసాద్, నరసింహ, అజయ్, నాయకులు రాహుల్, ఆంజనేయులు, శ్రీను, భాస్కర్ లు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థుల్లో మొక్కల పెంపకంపై అవగాహన పెంచడానికి రాష్ట్రంలో ఈ వర్షాకాలంలో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా అడవులు, పర్యావరణ రాష్ట్ర సలహాదారు కొమెర అంకారావు గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరులోని జడ్పీ హైస్కూలు విద్యార్థులకు గురువారం అవగాహన కలిగించారు. తాను పల్నాడు జిల్లాలో కోటి మొక్కలు నాటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు కోట్ల మొక్కలు నాటించేందుకు విద్యార్థుల్లో, ప్రజల్లో అవగాహన కలిగించాలని సూచించారని చెప్పారు. విద్యతో పాటు మొక్కల పెంపకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు పర్యావరణ ప్రాముఖ్యత, మొక్కల సంరక్షణ, వివిధ మొక్కల రకాలు, వాటిని ఎలా పెంచాలి, ఎలా సంరక్షించాలనేది అంకారావు వివరించారు. విద్యార్థుల్లో ప్రకృతిపై మమకారం పెంచేందుకు విత్తన బంతుల ప్రాముఖ్యతపై ఆయన కూలంకషంగా వివరించారు. మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం ఉన్నాయన్నారు. వీటివల్ల గాలి నాణ్యత మెరుగుపడుతుందని, నీటిని సంరక్షించడంలో సహాయపడుతుందని, నేల కోతను నివారిస్తుందని, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. మొక్కల పెంపకంపై విద్యార్థులతో అంకారావు ప్రమాణంతో పాటు నినాదాలు చేయించారు. గ్రామపెద్ద, సీనియర్ జర్నలిస్ట్ టి.డి.ప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మొదటి నుంచి పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. మొదట్లో వనయజ్ఞం పేరుతో నిర్వహించిన కార్యక్రమం వల్ల ఉమ్మడి రాష్ట్రంలో కోట్లకొలది మొక్కలు నాటారని, ఇంటికో మొక్క నినాదం అప్పటి నుంచే వచ్చిందని వివరించారు. తమ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు పర్యావరణ ప్రాముఖ్యత, మొక్కల పెంపకం ఆవశ్యకతపై అవగాహన కలిగించినందుకు అంకారావుకు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు ధన్యవాదాలు తెలిపారు. ఎలిమెంటరీ స్కూలు హెడ్ మిస్ట్రెస్ అన్నపూర్ణ, పర్యావరణ ప్రేమికుడు కిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తరగతి గదిలోనే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులు

○ **మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్**

○ **14న బ్రాహ్మణోత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** భావి భారతావనికి ఉపాధ్యాయులే ఉత్తమ రూపకర్తలని, గొప్ప సమాజ దార్శనికులని మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. భావి భారత పౌరులకు విద్య, విజ్ఞానంతో పాటు సామాజిక దృక్పథంతో కూడిన సరైన దశ-దిశ నిర్దేశించడం ద్వారా జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అందులోనూ బ్రాహ్మణ వర్గానికి చెందిన ఉపాధ్యాయులు తమ అపార మేధా సంపత్తితో ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపిస్తూ సమాజం పట్ల తమ గురుతర బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందుకే వారిలో అత్యుత్తమంగా సేవలందిస్తున్న వారిని గుర్తించి సన్మానించాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ, చరిత్రకు అందని కాలం నుంచి మానవ జాతి మనుగడ కోసం తమను తాము త్యాగం చేసుకుంటున్న బ్రాహ్మణ ఉపాధ్యాయులందరినీ ఒక వేదికపై చేర్చే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ జాతికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు ఈనెల 14వ తేదీన ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వర్గానికి చెందిన ప్రముఖులు హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తారని ఆయన వివరించారు.

విద్యార్థులకు ఉత్తమ విలువలు బోధించడం ద్వారా తరగతి గదిలోనే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగల గురువులను సత్కరించుకోవడం సముచితమన్న సత్సంకల్పంతోనే ఈ కార్యక్రమానికి రూపకల్పన చేయడం జరిగిందని జ్వాలాపురం శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో అపూర్వ స్పందన లభించినట్లు ఆయన చెప్పారు. అనేక దరఖాస్తులు వచ్చాయని.. వాటిలో తొలి విడతగా 46మందిని ఎంపిక చేయడం జరిగిందని.. ఆయన వివరించారు. ఇకపై ఈ కార్యక్రమాన్ని ఏటా ఒక నిరంతర ప్రక్రియలా నిర్వహిస్తామని.. మిగిలిన వారిని కూడా దశల వారీగా సత్కరిస్తామని.. జ్వాలాపురం శ్రీకాంత్ ప్రకటించారు.

అనంతరం ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రతినిధులతో కలిసి జ్వాలాపురం శ్రీకాంత్ సదరు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), కౌతా ధర్మ సంస్థల అధినేత కౌతా సుబ్బారావు, నిమ్మరాజు శారద తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో ఫ్రెషర్స్ డే వేడుకలు



**అమరావతి ,(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో గురువారం సాయంత్రం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇంజనీరింగ్ లిబరల్ ఆర్ట్స్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వారి ఉజ్వల భవిష్యత్తు కోసం అధునాతన పాఠ్యాంశాలతో కూడిన విద్యను అందుబాటులో ఉంచామన్నారు ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో తరగతి గదులు, హాస్టల్ సదుపాయం, రవాణా సౌకర్యాలు తదితరువన్నీ విద్యార్థులకు అనుగుణంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హాస్టల్, మెస్ ఏరియాలో క్యూఆర్ కోడ్ ను అందుబాటులో ఉంచనున్నామనినీ, ఇకమీదట విద్యార్థులు తమ సమస్యలు సూచనలు దీని ద్వారా తెలియపరిచే అవకాశం ఉందన్నారు ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ అలోహ పేరిట విద్యార్థులు నిర్వహిస్తున్న నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు అదేవిధంగా స్టూడెంట్ కౌన్సిల్ ఉద్భవ్ పేరిట తయారుచేసిన మ్యాగజైన్ని ఆవిష్కరించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్ సింగ్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణ స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నివేద శ్రీరామ్ హెచ్ఆర్ డైరెక్టర్ ఐజక్ సామల తదితరులు పాల్గొన్నారు.

## నిరసనవారం చేపట్టిన ఎపి. టీచర్స్ ఫెడరేషన్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంత్సరంన్నర కావస్తున్న ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కార చర్యలు చేపట్టలేదని, తమ డిమాండ్ల సాధనకు ఈనెల 17వ తేదీవరకు నిరసన వారం పాటిస్తున్నట్లు ఎపి. టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కె. బసవ లింగారావు పేర్కొన్నారు.

స్థానిక నందుల పేటలోని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలొ గురువారం సాయంత్రం నల్లబ్రాడ్జీలతొ నిరసన వారం ప్రారంభించారు. సమావేశంలో టీచర్స్ ఫెడరేషన్ నాయకులు నిరసన వారం ద్వారా చేపట్టే నిరసన కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడ్డామని,కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదునెలల్లోనె తమ సమస్యలు పరిష్కరిస్తాలని భావించామని, ఇప్పటి వరకు ఆ ఊసె లేదన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు,నిరసన వారం ద్వారా తమ నిరసన వ్యక్తం చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాష మాట్లాడుతు ఉపాధ్యాయులకు, గత 12సంవత్సరాలుగామెడికల్ రీయంబర్స్ మెంట్ కార్డులు, అలంకార ప్రాయంగా ఉన్నాయని, అవసరానికి ఉపయోగపడటం లేదని అన్నారు. తెల్లరేషన్ కార్డు దారులకు, అమలు చేయనున్న, 25,లక్షల ఆరోగ్యభీమా, ప్రీమియం చెల్లించె తమకు మెడికల్ రీయంబర్స్ మెంట్ కార్డు కు, 25లక్షల ఆరోగ్యభీమ అమలు చేయాలని కోరారు. శుక్రవారం మండల కేంద్రాల వద్ద నిరసన చేపడతామన్నారు.

ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఎమ్డీ ఖలీల్, పుట్టా జనార్ధనరావు, ఎ. వెంకటేశ్వరరావు, అంకినీడు, కె. లక్ష్మయ్య, డి. వెంకటేశ్వరరావు, కొసనా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మల సేవలకు గుర్తింపుగా బిజెపి కార్యక్రమం



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** విశ్వకర్మ జయంతి వేడుకలను పురస్కరించుకొని గుంటూరు జిల్లా బిజెపి కార్యాలయంలో ఆదివారం పత్రిక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ... "విశ్వకర్మలు ప్రజల దైనందిన జీవితానికి అవసరమైన పరికరాలను సృష్టిస్తూ సమాజానికి అమూల్యమైన సేవ అందిస్తున్నారు. వారి కృషి ఎప్పటికీ చిరస్మరణీయం. రాబోయే విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలి" అన్నారు.

ఓబీసీ మోర్చా నాయకులు రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ... "విశ్వకర్మ భగవాన్ ప్రపంచ మానవాళి కోసం అనేక సాధనాలను సృష్టించారు. ఆయన స్ఫూర్తితోనే మనుగడ సాగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన లక్షలాది కుటుంబాలకు మేలు చేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 17న అమరావతిలో జరగనున్న విశ్వకర్మ జయంతి వేడుకల్లో విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కోశాధికారి బి.ఎస్.కె. పట్నాయక్, ఆర్టిసన్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ హేమ సుందర్, నేషనల్ టెలికం అడ్వైజరీ బోర్డు సభ్యుడు ఉండవల్లి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, బజరంగ్ రామకృష్ణ, చరక కుమార్ గౌడ్, మోతే శేషగిరిరావు, కామేపల్లి వెంకటేశ్వర్లు, మల్లాల లక్ష్మణ్, తిరువల్లూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్సీ ఆలపాటి

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని లక్ష్మీపురం రోడ్డులో ఆయన కార్యాలయంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో ఉపాధ్యాయులపై రకరకాల మానసిక దాడులు జరిగాయని, బార్ షాపుల వద్ద డ్యూటీలు పెట్టారని, ప్రయోజనాల్లో కోతలు విధించారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడుతోందని, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ అసైన్మెంట్ బుక్స్ విధానం ఉపాధ్యాయులకు భారమైందని, వాటిని పునఃసమీక్షించి విద్యార్థులు పేపర్‌పై రాసే పద్ధతిని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరారు. బదిలీలు రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా జరిగాయని, తెలుగుదేశం ప్రభుత్వం కాలంలో లక్ష ఇరవై వేల మందికి పైగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిందని గుర్తుచేశారు.

రాష్ట్ర అధ్యక్షుడు స్కూలు శ్రీనివాసరాజు మాట్లాడుతూ




రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో 4400 పోస్టులు మంజూరు చేయడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించాలని, ఎంఈఓ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల్ హైమారావు మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్, గ్రేటర్ కార్పొరేషన్లలో అంతర్ బదిలీలు జరగాలన్నారు. 16,300 ఉపాధ్యాయ పోస్టులను తక్కువ సమయంలో భర్తీ చేయడం గొప్ప విషయమని అభిప్రాయపడ్డారు.

తరువాత నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నేతాజీ నగర్ పాఠశాల ఉపాధ్యాయుడు పుల్లగూర సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా మేడికొండూరు మండలం జెడ్‌పిహెచ్‌ఎస్ సిరిపురం ఉపాధ్యాయుడు ఎన్ భాస్కరరావు, ఆర్థిక కార్యదర్శిగా జెడ్‌పిహెచ్‌ఎస్ తాడేపల్లి ఉపాధ్యాయుడు కె నాగ శేషు ఎంపికయ్యారు.

**జిల్లా కమిటీ సభ్యులు:**

**గౌరవ అధ్యక్షుడు** – ఏ వెంకటేశ్వరరావు (జెడ్‌పిహెచ్‌ఎస్ దుగ్గిరాల),

**అసోసియేట్ అధ్యక్షులు** – పి లలిత బాబు (ఎస్‌సిఎంపీఎంసిహెచ్‌ఎస్ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్), తుమ్మ పాపారావు (జెడ్‌పిహెచ్‌ఎస్ ఈమని),

**ఉపాధ్యక్షులు** – ఎన్ వేణుగోపాలరావు (ఎస్‌జెఆర్‌ఆర్‌ఎంసిహెచ్‌ఎస్ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్), ఎస్‌కే ఖాసీం వలి (జెడ్‌పిహెచ్‌ఎస్ మేడికొండూరు), జి ఎస్ మాధవి (పీఎంసిహెచ్‌ఎస్ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్).

**అదనపు ప్రధాన కార్యదర్శులు** – కె హనుమంతరావు (జెడ్‌పిహెచ్‌ఎస్ గారపాడు), పి శరత్ బాబు (జెడ్‌పిహెచ్‌ఎస్ సిరిపురం),

**మహిళా కన్వీనర్** – ఎస్ పద్మావతి (జెడ్‌పిహెచ్‌ఎస్ వెంగళయపాలెం),

**కార్యదర్శులు** – పి చెంచయ్య (గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్), చి ఆందోని (జెడ్‌పిహెచ్‌ఎస్ అబ్బినేని గుంటపాలెం), బి యుగంధర్ (జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రత్తిపాడు).

రాష్ట్ర స్థాయిలో చి పినాకపాణి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా, ఎస్‌కే అబ్దుల్ ఖలీల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

## గీతా కులాల ధ్రువీకరణ పత్రాల్లో సవరణ



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** బీసీ–బీ జాబితాలో సీరియల్ నెం. 4లో గీతా కులాలకు సంబంధించిన వివరాల్లో ప్రభుత్వం సవరణలు చేసింది. రాష్ట్ర కార్మిక సంక్షేమం, వైద్య భీమా, ఫ్యాక్టరీల శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

గీతా కులాల తరపున మంత్రి వాసంశెట్టి శుభాష్ వినతిపత్రం సమర్పిస్తూ, కుల ధ్రువీకరణ పత్రాల్లో కులం పేరుకు ముందు 'గౌడ్' పదం రాయకుండా, కేవలం సంబంధిత కులం పేరే రాయాలని ముఖ్యమంత్రికి సూచించారు. మంత్రి సూచన మేరకు ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే, సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ సవరణ వల్ల గీతా కులాల వివిధ వర్గాలకు మేలు జరుగుతుందని మంత్రి శుభాష్ తెలిపారు. సమస్యను తెలియజేసిన వెంటనే ముఖ్యమంత్రి స్పందించి ఉత్తర్వులు జారీ చేసినందుకు ప్రజల్లో సంతోషం నెలకొన్నదని ఆయన పేర్కొన్నారు. "బీసీల అభివృద్ధిలో, రాష్ట్ర అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ చూపిన కట్టుబాటు స్పష్టమైందని ఈ జీవో ద్వారా నిరూపితమైంది. ప్రతిపక్షాలు ఇప్పటికీ బీసీల పట్ల కపట ప్రేమ మానుకుని, జాగ్రత్తగా ఆలోచించి రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలి" అని పేర్కొన్నారు.

## హోమి భాభా క్యాన్సర్ సెంటర్ లో 3 సూపర్ స్పెషాల్టీ కోర్సులు




○ 10 సీట్లతో ప్రవేశాలకు అనుమతించిన ప్రభుత్వం

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** దేశవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో 3 క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ కోర్సులను ప్రారంభించటానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది.

విశాఖపట్నంలోని ప్రఖ్యాత హోమి భాభా క్యాన్సర్ హాస్పిటల్ మరియు పరిశోధనా కేంద్రంలో 3 ఎంసిహెచ్ కోర్సులను ప్రారంభించడానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఎంసిహెచ్ సర్జికల్ ఆంకాలజిలో ప్రతి ఏడాది 2 సీట్లకు, ఎంసిహెచ్ గైనకలాజికల్ ఆంకాలజీ లో 4 సీట్లకు, డిఎమ్ మెడికల్ ఆంకాలజిలో 4 సీట్లకు ప్రవేశాలు జరుగుతాయి. ఈ 3 విభాగాల్లో రాష్ట్రంలో ప్రస్తుతం 13 ఎంసిహెచ్ సీట్లు మాత్రమే ఉన్నాయి.

120 పడకల తో కూడిన హోమి భాభా క్యాన్సర్ హాస్పిటల్ మరియు పరిశోధనా కేంద్రం భారత ప్రభుత్వం వారి పూర్తి గ్రాంటుతో అణుశక్తి విభాగం పర్యవేక్షణలో నడుస్తున్న సంస్థ. మొత్తం 10 సీట్ల తో 3 క్యాన్సర్ స్పెషాల్టీ కోర్సులను ప్రారంభించడానికి ముందుకు వచ్చిన ఈ సంస్థను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

## కర్నూలు జిల్లా గ్రామీణ విలేఖరులకు పునశ్చరణ తరగతులు

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** సెప్టెంబర్ నెల 13,14 తేదీలలో కర్నూలు జిల్లా గ్రామీణ విలేఖరులకు పునశ్చరణ తరగతులను సి. ఆర్. మీడియా అకాడమి నిర్వహిస్తున్నదనీ ఈ కార్యక్రమాన్ని గ్రామీణ విలేఖరులు సద్వినియోగం చేసుకోవాలని సి. ఆర్. మీడియా అకాడమి చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పునశ్చరణ తరగతులు పరిణయ ఫంక్షన్ హాల్, హోటల్ మౌర్య ఇన్ లో సెప్టెంబర్ 13,14 తేదీలలో జరుగుతాయి. ఈ కార్యక్రమం శనివారం (13.9.25) ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. సభా కార్యక్రమం అనంతరం తరగతులు ప్రారంభం అవుతాయి. 2 రోజుల కార్యక్రమంలో తొలి రోజున "ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్‌బీ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ బీ క్రైమ్ రిపోర్టింగ్" అనే అంశాలపైన తదుపరి 2వ రోజున "గ్రామీణ వార్తలు, కథనాలుబీ పత్రికా భాషబీ ఫ్యూచర్ రైటింగ్‌బీ విలేఖరుల నుంచి డెస్క్ ఏం కోరుకుంటుంది – డెస్క్ కోఆర్డినేషన్" అనే అంశాలపై సీనియర్ జర్నలిస్టులు శిక్షణ ఇస్తారని చైర్మన్ తెలియజేశారు.

## చంద్రగిరి ఎమ్మెల్యే ప్రజా దర్బార్



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తునట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గారు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి తిరుపతి రూరల్ మండలంలోని రఘునాథ రిసార్ట్స్ లోని చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని గారు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన ప్రజలు నుండి అర్జీలు స్వీకరించి ఎదుర్కొంటున్న సమస్యను విన్న ఎమ్మెల్యే గారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తూ ఆయా మండలాలకు సంబంధించిన అధికారులకు అందజేస్తా అని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్, తహసిల్దార్ కార్యాలయలలో ప్రజా వేదిక నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన వారి సమస్యను విన్న ఎమ్మెల్యే గారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తా అని తెలిపిన ఎమ్మెల్యే గారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కూటమి పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ దివ్యాంగుల చట్టాలపై విద్యాసంస్థల్లో అవగాహన

- ○ చట్టాలపై దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలి
- ○ ఆరోగ్య బీమా పథకాలలో వయస్సు పరిమితి తొలగించాలి
- ○ వృద్ధ మహిళలకు ప్రత్యేక రాయితీలు కల్పించి సులభ వడ్డీతో రుణాలు ఇవ్వాలి
- ○ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల స్థాయిల్లో విద్యార్థులకు పాఠ్యాంశం ప్రవేశపెట్టాలి
- ○ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి
- ○ వికసిత్ భారత్‌పై కేంద్రమంత్రి అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్




**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ మంత్రి డా.వీరేంద్ర కుమార్ అధ్యక్షతన వికసిత్ భారత్ 2027 వీడియో కాన్ఫరెన్స్ సమావేశం గురువారం జరిగింది. వెలగపూడి సచివాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి స్వామి పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి స్వామి ఈ క్రింది అంశాలు ప్రస్తావించారు. ఎస్సీ, ఎస్టీ దివ్యాంగుల చట్టాలపై దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలి. ఆరోగ్య బీమా పథకాలలో వయస్సు పరిమితి తొలగించాలి, వయో వందన హెల్త్ ఇన్సూరెన్స్ అర్హత వయస్సును 70 ఏళ్ల నుండి 60 ఏళ్లకు తగ్గించాలి. మహిళా వృద్ధులకు ప్రత్యేక రాయితీలు కల్పించి సులభ వడ్డీతో రుణాలు ఇవ్వాలి.

డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల స్థాయిల్లో విద్యార్థులకు పాఠ్యాంశం ప్రవేశపెట్టాలి. డీ–అడిక్షన్ సెంటర్ల సిబ్బందికి వేతనాలు నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బందితో సమానంగా పెంచాలి.

పాఠశాలలు, కళాశాలల్లో జెండర్ సెన్సిటైజేషన్ మాడ్యూల్స్ ప్రవేశపెట్టాలి. విద్య, ఉపాధి, వ్యాపారరంగంలో ట్రాన్స్‌జెండర్స్ కి సహాయం అందించాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమశాఖ మంత్రులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో ప్రతి విభాగం బలోపేతం

- ○ పేదలకు అత్యాధునిక వైద్య సేవలు
- ○ రాష్ట్రంలో వైద్య రంగానికి ప్రథమ ప్రాధాన్యం
- ○ సీఎంఆర్ఎఫ్ తో ఆరోగ్యానికి భరోసా
- ○ జీజీహెచ్ లో డిజిటల్ రేడియోగ్రఫీ మెషీన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రతి విభాగానికి అవసరమైన పరికరాలు, అధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రూ. 13 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ రేడియోగ్రఫీ మెషీన్ ను గురువారం సూపరింటెండెంట్ యశస్వీ రమణతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ నిధులతో డిజిటల్ రేడియోగ్రఫీ మెషీన్ ను సమకూర్చామని, రోజుకు సుమారు 400 వరకు ఎక్స్ రేలు తీసే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వాస్పత్రిలో ఆరు ఎక్స్ రే మిషన్లు ఉన్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో 3500 వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారని చెప్పారు. సీఎం సహాయనిధి ద్వారా నిరుపేదలకు అత్యవసర సమయంలో ప్రైవేటు వైద్యం చేయించుకునే అవకాశం కల్పించారని తెలిపారు.

**నేపాల్ బాధితులకు గుండె ధైర్యమిచ్చాం**

నేపాల్ అల్లర్లలో చిక్కుకుని బిక్కుబిక్కుమంటున్న ఆంధ్రప్రదేశ్ వాసులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గుండె ధైర్యంగా నిలిచారాని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నేపాల్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ తెలుగు వారి పరిస్థితి తెలుసుకున్న వెంటనే మంత్రి లోకేశ్ అనంతపురం పర్యటన సైతం రద్దు చేసుకుని కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితి పర్యవేక్షించారన్నారు. బాధితులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి ధైర్యం కల్పించారని, ఇది ప్రజలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అని పేర్కొన్నారు. మంత్రులు నారా లోకేశ్, హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత, ఏపీ టూరిజం మినిస్టర్ కందుల దుర్గేష్ కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేపాల్ బాధితుల గురించి మానవతా దృక్పథంతో కూడా జగన్ స్పందించలేదని, ఇదేనా ప్రజల పట్ల వైసీపీకి ఉన్న చిత్తశుద్ధి అని విమర్శించారు.

## మంత్రి లోకేష్ కృషితో నేపాల్ నుంచి స్వస్థలాలకు తెలుగు ప్రజలు

○ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు వారికి అపద అనే పదం వినబడితే చాలు నన్ను దాటి వారిని టచ్ చేయాలనే విధంగా ఆపదకే అడ్డుగా నిలిచారు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం అన్నారు.

నేపాల్ లో జరుగుతున్న మారణోమంలో తెలుగు వారు ఉన్నారని తెలియగానే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆ బాధ్యతను మంత్రి నారా లోకేష్ కు అప్పగించడం జరిగిందన్నారు.

వెంటనే నారా లోకేష్ అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని, ఉదయాన్నే హుటాహుటిన ఏ పి సచివాలయానికి చేరుకొని, రియల్టైం గవర్నెన్స్ సెంటర్ వార్ రూమ్ ను కమాండ్ కంట్రోల్ రూమ్ గా మార్చి సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు.

నేపాల్ లోని బాధితులతో మాట్లాడి వారికి నారా లోకేష్ ధైర్యం చెప్పారని, ఎక్కడెక్కడ ఉన్నారో లొకేషన్ కోఆర్డినేట్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో అత్యవసర హెల్ప్ సెంటర్ ఏర్పాటు చేయడం, చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా లోకేష్ చూశారని, మానవీయ స్పందన, తమ ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను మంత్రి నారా లోకేష్ చాటి చెప్పారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కొనియాడారు.

కేంద్ర ప్రభుత్వం అండ, సమన్వంతో ఈ ఆపదలో ఉన్న ఒక్కొక్కరినీ సురక్షితంగా రక్షించడానికి నారా లోకేష్ పక్కా వ్యూహంతో ముందుకు కదిలారని ఆమె వివరించారు.

నేపాల్లో జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన సుమారు 215 తెలుగు ప్రజలను సురక్షితంగా తిరిగి తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రశంసించారు.

**తెలుగువారికి అండగా :** ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఎప్పుడు ఎక్కడ ఆపద వచ్చినా ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందన్న విషయం నారా లోకేష్ ద్వారా మరోసారి స్పష్టమైందని ఆమె అన్నారు.

నేపాల్లో తెలుగువారు చిక్కుకున్నారని తెలిసిన మరుక్షణమే అనంతపూర్ పర్యటన రద్దు చేసుకుని ఆగమేఘాల మీద అమరావతికి వచ్చి ఆఖరి ప్రయాణికుడి వరకు స్వస్థలాలకు తీసుకువచ్చే బాధ్యతలు తీసుకున్నారని,

కంబోడియా సైబర్ స్కామ్ (జూన్ 2025) కంబోడియాలో మోసపూరిత ఉద్యోగ ఆఫర్లతో చిక్కుకున్న మీసాల ఆది బాబు వంటి తెలుగు యువకులను రక్షించడంలో లోకేష్ కృషి మరువలేనిదన్నారు.

నేపాల్లో తెలుగువారు చిక్కుకుంటే వైసీపీ అధినేత జగన్ రెడ్డి నుంచి కనీస స్పందన లేదని, కనీసం మానవతాదృక్పథంతో కూడా వ్యవహరించలేదని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విమర్శించారు.

గతంలో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకుపోయిన తెలుగువారిని తీసుకురావడంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని స్వదేశానికి తీసుకురావడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించారని, ఇప్పుడు నేపాల్ నుంచి తెలుగువారికి సురక్షితంగా తీసుకురావడంలో తండ్రి చూపిన ఆదర్శ బాటలో నారా లోకేష్ నడిచారని ఆమె పొగిడారు.

## రాజధానిలో ప్రపంచబ్యాంక్, ఆసియా బ్యాంక్ బృందం పర్యటన



**తుళ్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని అమరావతిలో నగర అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టు కింద అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను పరిశీలించేందుకు వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు బృందం రెండ్రోజుల పర్యటిస్తుంది. ఈ నేపథ్యంలో తొలి రోజు గురువారం గెజిటెడ్ అధికారుల టైప్ 1,2, నాన్ గెజిటెడ్ అధికారుల నివాస సముదాయాలు, ఇ %–% 6 ట్రంక్ రోడ్, ఎల్‌పిఎస్ జోన్ 2ఎ, 1ఎ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించింది. నిర్మాణ పనుల పురోగతి, నిర్మాణ ప్రదేశాల్లో పనిచేస్తున్న కార్మికులకు గుత్తేదారు సంస్థలు అందిస్తున్న మౌలిక వసతులను గురించి బృందం సభ్యులు ఆరా తీశారు. సిఆర్‌డిఎ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. అనంతవరంలో ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నర్సరీ, తుళ్లూరులోని సిఆర్‌డిఎ స్కిల్ హబ్ ప్రాంగణం, ఎన్ –9 ట్రంక్ రోడ్ పనులు, శాఖమూరు, నీరుకొండ రిజర్వాయర్‌ల వద్ద పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలను పరిశీలించారు. బృందంలోని ప్రతినిధులు ఆయా సైట్‌లలో నిర్మాణ పనుల పురోగతి, పర్యావరణ, సామాజిక రక్షణ ప్రమాణాలు అమలులో ఉన్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. రెండోవ రోజు శుక్రవారం విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో కమిషనర్ కన్నబాబుని కలిసి రాజధానిలో పర్యావరణ సామాజిక అంశాల అమలుపై చర్చిస్తారని, దానికి ముందుగా నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాజధాని పనుల పురోగతిపై మాట్లాడతారని చెప్పారు.

## సీజనల్ వ్యాధుల కట్టడిలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

○ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ హెచ్చరిక

**మంగళగిరి,(జర్నలిస్ట్ ఫైల్):** సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ హెచ్చరించారు. కనీసం గత మూడేళ్ల నుంచి నమోదవుతున్న కేసులకనుగుణంగా ప్రస్తుత సీజనల్ వ్యాధుల రాకను గమనించి అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

" గుంటూరు నగర శివారులోని తురకపాలెంలో సకాలంలో మరణాల నమోదులో క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అలక్ష్యం జరిగింది. జిల్లా నుంచి రాష్ట్ర పర్యవేక్షణ అధికారులకు సమాచారం అందలేదు. శాఖాపరమైన విచారణ నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు ఉంటాయి. ?పారిశుద్ధ్యం లోపం, నీరు, ఆహారం కలుషిత ఘటనలతోనే సీజనల్ వ్యాధుల కేసులు ఎక్కువగా వస్తున్నాయి. సాధారణ స్థాయిలో కంటే కేసుల నమోదు ఎక్కువగా ఉంటే వెంటనే క్షేత్ర స్థాయి సిబ్బంది ఎందుకు గమనించలేకపోతున్నారు. . కాలానుగుణ వ్యాధుల రాకకు దారితీసే కారణాలు, సమస్యాత్మక ప్రాంతాల గురించి సిబ్బంది, అధికారులుకు తెలుసు. అయినా నిర్లక్ష్యంగా ఎందుకు ఉంటారు. సంబంధిత శాఖల వారికి ఎందుకు వెంటనే తెలియజేయడంలేదు. ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకురావడం లేదు. ఇకపై అలా జరగడానికి వేల్లేదు. విజయవాడలో డయేరియా కేసులు నమోదయినప్పుడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంటనే సంబంధిత శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ఇదే స్ఫూర్తితో జిల్లా అధికారులు వ్యవహరించాలి . కాలానుగుణ కేసుల గురించి సకాలంలో క్షేత్ర స్థాయి సిబ్బంది, పీహెచ్సీ వైద్యులు, జిల్లా అధికారులకు తెలియడంలేదంటే అక్కడ నిర్లక్ష్యం తీవ్రంగా ఉన్నట్లే " అని వీరపాండియన్ జిల్లా వైద్య అధికారులకు స్పష్టంచేశారు.

## భారీ ఎన్‌కౌంటర్..

○ 10 మంది మావోయిస్టులు మృతి



**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియా బంద్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా ఘన్‌పూర్‌కు చెందిన మనోజ్ అలియాస్ మోడెం బాలకృష్ణ, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ యారఫ్ పాండు, సహా 9 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. ఈ ఎన్‌కౌటంర్‌పై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467